## అనర్హత నుంచి దానం తప్పించుకోలేరు

హైదరాబాద్,కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వేటు నుంచి తప్పించుకోలేరని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం నాడు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... గతంలో లాగా స్పీకర్ అనర్హత పిటిషన్‌పై జాప్యం చేసే పరిస్థితి సుప్రీంకోర్టు ఇటీవల ప్రకటించిన తీర్పుతో పోయిందని చెప్పారు. మహారాష్ట్రలో శివసేనను వీడిన ఏక్ నాథ్ షిండే గ్రూప్ ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టు ఈ తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. మూడునెలల్లో నిర్ణయం తీసుకోవాలని మహారాష్ట్ర స్పీకరును కోర్టు ఆదేశించిందని చెప్పారు.స్పీకర్‌కు కోర్టులు కాలపరిమితి విధిస్తున్నందున అనర్హత పిటిషన్‌పై ఇక వాయిదాలు కుదరవని హెచ్చరించారు. దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నప్పటి నుంచే ఆయన శాసన సభా సభ్యత్వం రద్దయినట్టేనని చెప్పారు. స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకుని రాజ్యాంగాన్ని గౌరవించాలని కోరారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కాంగ్రెస్ దివంగత నేత రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నపుడే 1985లో రూపొందించారని అన్నారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :31 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 20-03-2024 | పేజీలు:4 వెల: 2.00


## కాంగ్రెస్‌లో మల్కాజిగిరి టిక్కెట్ ఫైట్ !



హైదరాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులకు టికెట్ టెన్షన్ పట్టుకుంది. మల్కాజిగిరి అభ్యర్థిని ఎంపిక చేయడం కాంగ్రెస్‌కు కత్తి మీద సాముల మారినట్టు కనిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్‌కు స్థానం కావడం, బలమైన అభ్యర్థులు లేకపోవడంతో ఎంపిక క్లిష్టంగా మారినట్లు సమాచారం. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ తమ అభ్యర్థులుగా రాగిడి లక్ష్మారెడ్డి, ఈటల రాజేందర్‌ను ప్రకటించారు. బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తుండగా.. రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తోంది. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, కంటోన్‌మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధికి వచ్చే మల్కాజిగిరి పార్ల మెంట్ స్థానానికి దీటైన అభ్యర్థిని రంగంలోకి దించాలని పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఆలోచిస్తోంది. లో రోజుకో పేరు తెరపైకి వస్తోంది. ఇప్పటి వరకు సినీనటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించినా, రెండు, మూడు రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలను చూస్తుంటే కొత్త వారు బరిలో ఉండేలా కనిపిస్తారు. నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి పేర్లు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు పోటీలో ఉంటారని జోరుగా ప్రచారం. వికారాబాద్ జెడ్పీ చైర్‌మెన్ సునీతా మహేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిలో ఎవరికో ఒకరికి టికెట్టు దక్కేలా ఉంది. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి పోటీ చేస్తారని ముందుగా ప్రచారం జరిగిన సమయంలో బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్‌ను బరిలో నిలపడంతో ఆయన చేవెళ్ల నుంచే పోటీ చేస్తానని చెప్పారు. తనకు మల్కాజిగిరి సీటు కావాలని మర్రి జనార్ధన్ రెడ్డి హైకమాండ్ స్థాయిలో లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఎవరికి ఇచ్చిన రేవంత్ చాయిస్ ను బట్టి అంచనా వేస్తున్నారు.

## మహిళలను విచారించడంలో మార్గదర్శకాలు



న్యూఢిల్లీ,మార్చి19: ఈడీ కేసులో మహిళలను విచారించేందుకు మార్గదర్శకాలను జారీ చేయాలని, అంత వరకూ ఢిల్లీ లిక్కర్ కేసులో తనను అరెస్ట్ చేయవద్దంటూ దాఖలైన పిటిషన్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తరపు న్యాయవాది ఉపసంహరించుకున్నారు.

పిటిషన్ ఉపసంహరణకు జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం అనుమతి ఇచ్చింది. ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను అరెస్ట్ చేసినందున గతంలో ఆమె దాఖలు చేసిన పిటిషన్ నిరర్ధకం అయినట్లు ఆమె తరుపు న్యాయవాది విక్రమ్ చౌదరి పేర్కొన్నారు. కవిత పిటిషన్ ఉపసంహరణకు ఈడీ తరపు న్యాయవాది ఎస్వీ రాజు అభ్యంతరం తెలపలేదు. కాగా.. తన అరెస్ట్ అక్రమమంటూ దాఖలు చేసిన ఎమ్మెల్సీ కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టు లో నేడు విచారణ జరిగింది. కవిత తరపున వాదించాల్సిన సీనియర్ కౌన్సిల్ కపిల్ సిబల్ వేరే కోర్టులో బిజీగా ఉన్నందున 11 గంటలకు విచారణను ధర్మాసనం వాయిదా వేసింది. ఈ క్రమంలోనే తన అరెస్ట్‌పై కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై 11 గంటలకు సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

## కవితక్కా..తీహార్ జైలుకు స్వాగతం



న్యూఢిల్లీ,మార్చి19: ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై జైలు నుంచి సుఖేశ్ చంద్రశేఖర్ సంచలన లేఖ రాశారు. ఇప్పటి వరకూ కవితను టాగంట్ చేస్తూ ఆయన ఎన్నో లేఖలు విడుదల చేశారు. కవితకు.. తనకు మధ్య జరిగిన ఛాటింగ్ వివరాలను సైతం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇన్నాళ్లుగా తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు, రాజకీయ కక్ష సాధింపు అంటూ చెప్పినవన్నీ అబద్ధాలని తేలింది. ఇన్నాళ్లకు నిజం బయటికొచ్చిందని.. చేసిన పనుల కర్మ ఫలం ఇప్పుడు వెంటాడుతోందని సుఖేష్ లేఖలో పేర్కొన్నారు. నిజం శక్తి ఏంటో తెలుసుకోవాలి. ఎదుర్కోవాల్సి ఉంటుంది. నన్ను ఎవరూ ఏమి చేయలేరని అనుకునేవారు. కానీ కొత్త భారతదేశంలో చట్టమే అన్నింటికన్నా శక్తివంతమైంది. నేను గతంలో మీడియాకు విడుదల చేసిన లేఖల్లో 2 అంశాలు పొందుపరిచాను. అందులో ఒకటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవుతుంది.. రెండోది తిహార్ క్లబ్‌లో చేరేందుకు కవితకు కౌంట్ డౌన్ మొదలైంది. ఈ రెండూ ఇప్పుడు నిజమయ్యాయని అనిపిస్తోంది. కవిత అరెస్టుతో అవినీతి పండోరా బాక్స్ ఓపెన్ అయింది. కవితతో పాటు ఆమె అవినీతి సహాయకులు, అవినీతి రాజు అరవింద్ కేజ్రీవాల్ చేసిన అక్రమాలన్నీ బయటపడతాయన్నారు. వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం లూటీ చేసి సింగపూర్, హాంగ్‌కాంగ్, జర్మనీ వంటి దేశాలకు పంపిన విషయాలు బయటికొస్తాయి. ఇది ఎవరికి అర్థం కావాలో వారికి అర్థమైందని అనుకుంటున్నాను. అక్కా!..నేను వాట్సాప్ చాట్ స్క్రీన్ షాట్ల ద్వారా బయటపెట్టిన నెయ్యి డబ్బాల కథలు, రేంజ్ రోవర్ కలెక్షన్ కథలు, గోవా కథలు, కాంట్రాక్ట్ కథలు దర్యాప్తులో నిజమని తేలాయి. బయటపడే మార్గమే లేదు అక్కా. ఇప్పటికైనా నా విన్నపం ఒక్కటే.. అవినీతి సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్ ను కాపాడేందుకు నిజాన్ని దాచే ప్రయత్నం చేయవద్దు. ఎందుకంటే ఈ దేశ ప్రజలు, న్యాయస్థానాలు నిజం తెలుసుకున్నాయి. ఇందుకు కావాల్సినంత సాక్ష్యాలు, ఆధారాలు ఉన్నాయి. ఏదేమైనా ఈడీ, సీబీఐ కన్‌ఫ్రంటేషన్ లో భాగంగా మిమ్మల్ని త్వరలోనే ముఖాముఖి చూస్తాను అక్కా.. మా గ్రేటెస్ట్ తిహార్ జైలుకు స్వాగతం అక్కా.. మీ మరో సోదరుడు, అవితిని సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్ మీకు జైల్‌లో లగ్జరీ జీవితం అందంచేందుకు అన్ని ఏర్పాట్లు చేసి ఉంటారు. ఈ లేఖను ముగించే ముందు మరొక్క మాట చెప్పదల్చు కున్నా.. 'సినిమా ఇంకా మిగిలే ఉంది'. కేజ్రీవాల్ జీ.. తదుపరి ఇక మీరే. ఎంత ప్రయత్నించినా సాధ్యం కాదు. సినిమా ÷–లకైమాక్స్‌కు చేరుకుంది. కేజ్రీవాల్ జీ.. నా సోదరసోదరీమణులకు తిహార్ క్లబ్‌కు స్వాగతం పలుకుతున్నాను' అని సుఖేష్ చంద్రశేఖర్ లేఖలో పేర్కొన్నారు.

## తమిళనాట కాలుమోపే లక్ష్యం..నాలుగైదు ఎంపి సీట్లపై బిజెపి గురి



చెన్నై,మార్చి19: తమిళనాడులో కాలుమోపేందుకు బీజేపీ వడివడిగా అడుగులు వేస్తోంది. ఈసారి కనీసం ఓ నాలుగైదు సీట్లు గెల్చుకోవాలని చూస్తోంది. 400కుపైగా లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న కషాయ దళానికి దక్షిణాది రాష్ట్రాల్లో గెలుపు కచ్చితంగా అవసరమని భావిస్తోంది. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్న చందంగా తమిళనాట అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల కోసం బీజేపీ అధినాయకత్వం సరికొత్త వ్యూహం రచిస్తున్నది. తమిళనాడులో పోటీకి గవర్నర్ తమిళసై రాజీనామా చేసి మరోమారు రంగంలోకి దిగారు. గతంలో తమిళసై ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలుగా పనిచేశారు. ఎక్కడ ఎలా వ్యూహం పన్నాలో ఆమెకు బాగా తెలుసు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. 400 ప్లస్ సీట్లను ఎన్డీయే టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందుకోసం దక్షిణ రాష్ట్రాల్లో గెలుపు కచ్చితంగా అవసరమని భావిస్తోంది. ఈ క్రమంలోనే లక్ష్యం దిశగా..సీట్ల కేటాయింపుల విషయంలోనూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. తమిళనాడులో ఇప్పటికే దినకరన్, మాజీ సీఎం పన్నీర్ సెల్వంతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. అయితే తాజాగా ఎన్డీయే కూటమిలో చేరిన పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) కు 10 సీట్లను కేటాయించి ఆసక్తికర చర్చకు దారి తీసింది. పీఎంకే నిర్ణయంతో తమిళనాడు ప్రధాన ప్రతిపక్ష పార్టీ అన్నాడీఎంకే (ఏఐఏడీఎంకే) లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రతికూల ప్రభావం పడనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత సీనియర్ రాజకీయ నాయకులలో ఒకరైన పీఎంకే వ్యవస్థాపకుడు ఎస్ రామదాస్ పొత్తు, సీట్లపై చర్చలు బీజేపీతో కాకుండా ఏఐఏడీఎంకేతో జరపాలని అనుకున్నారు. చర్చలు జరిపేందుకు ఏఐఏడీఎంకే ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి వద్దకు ఓ దూతను పంపారు. అదే సమయంలో చెన్నైకి 120 కిలోమీటర్ల దూరంలోని తైలాపురంలో సమావేశమైన పీఎంకే అత్యున్నత స్థాయి కమిటీ బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. అన్నాడీఎంకేని కాదని బీజేపీతో పొత్తు పెట్టుకోవాలనే నిర్ణయాన్ని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ ప్రతిపాదించారు. ఆ పార్టీ ఏఐఏడీఎంకేతో తెగతెంపులు చేసుకుని బీజేపీతో పొత్తుతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. పొత్తుపై పీఎంకే ప్రధాన కార్యదర్శి వడివేల్ రావణన్ మాట్లాడుతూ.. 'బీజేపీతో పొత్తు పెట్టుకుని లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొంటామని పీఎంకే వ్యవస్థాపకుడు ఎస్ రామదాస్ అత్యున్నత స్థాయి కమిటీ సమావేశంలో ప్రకటించినట్లు తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని కూటమిలో చేరాలనే నిర్ణయాన్ని రామదాస్, ఆయన కుమారుడు అన్బుమణి సంయుక్తంగా తీసుకున్నారని' చెప్పారు. పీఎంకేలో బీజేపీతో పొత్తు పెట్టుకోవడంపై ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవని పార్టీ నేతలు వెల్లడించారు. అధికారిక ఎన్నికల ఒప్పందంపై సంతకం చేసేందుకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కె. అన్నామలై తైలాపురం వెళ్లనున్నారు. బీజేపీ కూటమిలో చేరాలని పీఎంకే తీసుకున్న నిర్ణయం, అధికార పార్టీ డీఎంకే, ప్రతిపక్ష పార్టీ ఏఐఏడీఎంకేలకు ధీటుగా బీజేపీ ఎదిగేందుకు.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం చేస్తున్నాయి. గతంలో బీజేపీ ఎన్డీయే కూటమిలో అన్నాడీఎంకే భాగస్వామిగా ఉండేది. అన్నామలై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్నాడీఎంకే నేతల అవినీతిపై ఆరోపణలు చేశారు. దాంతోపాటు దివంగత ముఖ్యమంత్రి జయలలితను విమర్శించడంతో ఇరు పార్టీల మధ్య విభేదాలు పెరిగాయి. ఈ క్రమంలోనే ఎన్డీయే కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు అన్నాడీఎంకే ప్రకటించింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని 15మంది మాజీ ఎమ్మెల్యేలు, ఒక ఎంపీని బీజేపీలో చేర్చుకుంది. తాజాగా, లోక్‌సభ ఎన్నికల్లో వన్నియార్ సామాజిక వర్గంలో దాదాపు 6 శాతం ఓటు బ్యాంకు ఉన్న పీఎంకేతో జతకట్టింది. ఉత్తర తమిళనాడులో ఓటు షేర్ పెంచుకోవాలని భావిస్తున్న బీజేపీకి పీఎంకేతో పొత్తు మరింత లబ్ది చేకూర్చుతుంది. దక్షిణ తమిళనాడు అంతటా ఆధిపత్య వర్గాలను ఆకర్షించడంలో అన్నాడీఎంకే నాయకులు ఓ పన్నీర్ సెల్వం, టీటీవీ దినకరన్‌ల మద్దతు కూడగట్టుకుంది. లోక్‌సభ ఎన్నికలే కాదు తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేసేలా మోదీ వరుస పర్యటనలు చేయడంతో పాటు, భారీగా నిధులు కేటాయించేందుకు కేంద్రం సిద్ధమైంది.

## "నేను పార్ట్ టైం పొలిటీషియన్..



హైదరాబాద్, సంచలన వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలిచే మాజీ మంత్రి మల్లారెడ్డి మరోసారి వార్తల్లోకి ఎక్కారు. ఇటీవల కాలంలో ఆయన పార్టీ మార్పుపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే.. ఆదివారం ఆయన నివాసానికి పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలు వెళ్లడం.. వారంతా కలిసి పెద్ద ఎత్తున చర్చలు జరపడం తెలిసిందే. ఈ పార్టీకి చెందిన అందరు నేతల ముందు తాను పార్టీ మారేందుకు సిద్ధమైన వెంటనే ఓపెన్ గా చెప్పేసినట్లుగా కనిపిస్తోంది. ఈ వ్యవహారం బీఆర్ఎస్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. తాను పార్ట్ టైం పొలిటీషియన్ ను అని.. ఫుల్ టైం బిజినెస్ మేన్ గా అభివర్ణించిన ఆయన.. తాను పార్టీ మారటం పక్కా అని స్పష్టం చేశారు. తాను రెండు పార్టీల్లో ప్రయత్నిస్తు న్నానని.. ఎందులో వర్కువుట్ అయితే అందులో వెళ్లిపోతానన్న మాట ఆయన నోటి నుంచి రావటంపై గులాబీ నేతలు అవాక్కు అవుతున్నారు. నిజానికి ఈ పరిణామం ఎలా చోటుచేసుకుందన్న విషయంలోకి వెళితే కాస్త వెనక్కి వెళ్లాల్సి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీ స్థానానికి జరిగే ఎన్నికల్లో పోటీ చేసేందుకు తన కొడుకు భద్రారెడ్డిని రంగంలోకి దించిన మల్లారెడ్డికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం సానుకూలంగా స్పందించారు. అయితే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన కాలేజీల విషయంలోనూ.. తన విద్యా సంస్థలకు సంబంధించిన అంశాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించిన అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తన చేతిలో అధికారం లేకుంటే ఇబ్బందులు తప్పవన్న విషయాన్ని గుర్తించిన ఆయన.. బీఆర్ఎస్ సంస్థ ఎన్నికల్లో పోటీ పడితే మరిన్ని ఇబ్బందులు తప్పవన్న ఉద్దేశంతో తాము బీఆర్ఎస్ నుంచి పోటీ చేయలేమని సున్నితంగా చెప్పారు. ఓవైపు పోటీకి దూరం అంటూనే మరోవైపు కాంగ్రెస్ లో చేరి.. మల్కాజిగిరి అభ్యర్థిగా తన కొడుకును దించాలన్న నిర్ణయాన్ని తీసుకున్న మల్లారెడ్డి.. అందుకు తగ్గట్లు పావులు కదిపారు. ఇందులో భాగంగా కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ అయ్యారు. ఈ విషయాలన్నీ బయటకు రావటంతో ఆయన వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ఈ తాను పార్టీ మారటం లేదని.. అయితే తన కొడుకు పోటీ విషయంలో అతనిదే నిర్ణయమని చెప్పారు. ఈ విధంగా మల్లారెడ్డికి ముందరకాళ్ల బంధం వేసేందుకు వీలుగా బీఆర్ఎస్ పెద్దలు రంగంలోకి దిగారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న రాగిడి లక్ష్మారెడ్డిని తీసుకొని మల్లారెడ్డి ఇంటికి ఆదివారం ఉదయం వెళ్లాలని.. ఆయన గెలుపు కోసం పని చేయాలని సూచించారు. అనుకున్నట్లే పలువురు ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలు మల్లారెడ్డి ఇంటికి వెళ్లారు. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ భేటీలో మల్లారెడ్డి ఓపెన్ అయినట్లుగా సమాచారం. తాను పార్టీ మారటం ఖాయమని.. తాను పార్ట్ టైం పొలిటిషియన్.. ఫుల్ టైం బిజినెస్ మ్యాన్ గా వైనం గులాబీ నేతలకు దిమ్మ తిరిగే షాకిచ్చిందంటున్నారు. తాను పార్టీ మారటం ఖాయమని.. త్వరలోనే ఆ సర్వే వెల్లడిస్తానని ఆయన చెప్పారు. తాను కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించే.. కొన్ని రాష్ట్ర నేతలు ఆ భేటీలో వెల్లడించినట్లుగా తెలుస్తోంది. ఈ సందర్భంగా కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివ ఎపిసోడ్ ను కూడా వివరించేందుకు మొహమాటపడలేదని చెప్పారు. మ్యాన్ కావటంతో రాజకీయంగా కొన్ని బిజినెస్ నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోందన్న ఆయన మాటలు బీఆర్ఎస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పదేళ్లు మంత్రిగా ఉన్నపెద్ద మనిషి.. పార్టీ పరాజయం పాలైన తర్వాత పట్టించుకోకుండా వెళ్లిపోవడం ఏమిటని ప్రశ్నగా మారింది. ఈ భేటీలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే కం మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్ రెడ్డి మాత్రం తాను పార్టీ మారే ఉద్దేశం లేదన్న ప్రజాభిమానం అందరి ఎదుటే చెప్పేయటం కొసమెరుపు. మామ ఏమో పార్టీ మారడం ఖాయమని తేల్చేస్తే.. అల్లుడు మాత్రం గులాబీ కారును ఎట్టి పరిస్థితుల్లో దిగేది లేదని తేల్చేయటం చూస్తే.. మల్లారెడ్డా మజాకానా? అన్న భావన కలుగక మానదు.

## శక్తి వర్సెస్ శక్తి...

న్యూఢిల్లీ,లోక్ సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. శక్తి అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారాన్ని రేపాయి. అధికారం అన్న అర్థం వచ్చే రీతిలో శక్తి అన్న పదాన్ని రాహుల్ ఉపయోగించగా, ఇది దుర్గాదేవిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్య అంటూ బీజేపీ విమర్శలు సంధించింది. సాక్షాత్తూ ప్రధాని మోడీ.. స్పందించడంతో విమర్శలు, ప్రతివిమర్శలు ప్రారంభమయ్యాయి. బీజేపీ విమర్శలకు ప్రతిస్పందించిన కాంగ్రెస్.. ప్రస్తుత ఎన్నికలు అసుర శక్తి అయిన బీజేపీ, దైవిక శక్తిని అయిన ఇండియా కూటమి మధ్య జరిగే పోరాటమని. భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా ఆదివారం ముంబైలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగిస్తూ ఈడీ, సీబీఐ, ఐటీ, ఈవీఎంలు లేకుండా మోదీ ఎన్నికల వెళ్లలేరని, వాటిని దుర్వినియోగం చేస్తున్న ఆ శక్తికి వ్యతిరేకంగా పోరాడతామని అన్నారు. మోడీపై చేస్తున్న పోరాటం ఆయనపై వ్యక్తిగతంగా చేస్తున్నది కాదు. ఎందుకంటే ఆయన ఓ శక్తికి ముసుగు మాత్రమే అని గుర్తు.అయితే శక్తి అన్న పదం దుర్గాదేవికి సంబంధించినది కావడంతో బీజేపీ ఆ కోణంలో విమర్శలు మొదలయ్యాయి. సోమవారం జగిత్యాలలో మోడీ మాట్లాడుతూ.. వారు శక్తిపై పోరాటం చేస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలోనే పెట్టారు. నాకైతే ప్రతి తల్లి, చెల్లి శక్తి స్వరూపులే. నేను శక్తిని ఆరాధిస్తాను. నేను భారత మాత పూజారిని అని అన్నారు. శక్తిని నాశనం చేయాలనుకునేవారికి, శక్తి ఆరాధకులకు మధ్య పోరాటం జరుగుతోందని, శక్తి స్వరూపిణులైన మహిళలందరూ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని.

### మోడీపై కాంగ్రెస్ ఫైర్

ప్రధాని వ్యాఖ్యలపై రాహుల్ ట్వీట్ చేస్తూ తన మాటలను వక్రీకరిచేందుకు మోడీ ఎల్లప్పుడూ ప్రయత్నిస్తారని. తాను శక్తి గురించి చేసిన వ్యాఖ్యలు మోడీకి ఉన్న అధికారం గురించేనని స్పష్టం చేశారు. మోడీ అధికారానికి దేశ మీడియా రాత్రింబవళ్లు సెల్యూట్ చేస్తూ సత్యాన్ని అణచివేస్తోందన్నారు రాహుల్. కాంగ్రెస్



ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రా సూచన.. పెద్దలు తీసి, ప్రజల దృష్టిని మళ్లించడంలో మోడీమాస్టర్ అని. రాహుల్ గాంధీ ..అసుర శక్తిపై దాడి ప్రారంభించగానే కంగారు పడ్డ ప్రధాని నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. మహిళా రెజర్లను బ్రిజ్ భూషణ్ వేధించినప్పుడు ప్రధాని ఏ శక్తిని పూజించారు? కథువా, ఉన్నావ్, హత్రాస్ రేపిస్టులకు మద్దతుగా బీజేపీ శ్రేణులు ఊరేగింపులు జరిపినప్పుడు శక్తిని పూజించాలని మోడీకి గుర్తుకు రాలేదా అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు.దేశంలో ఇన్ని సమస్యలు ఉండగా.. శక్తి అన్నపదాన్ని పట్టుకుని ప్రధానపార్టీలు రాజకీయంగా విమర్శలకు దిగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలు వాటి వైఖరి చెప్పాలి కానీ.. ఇలాంటి అనవసరమైన ప్రాధాన్యమున్న అంశాలను హైలెట్ చేయకూడదంటున్నారు రాజనీతిజ్ఞులు. అందుకేనా ప్రధాని హోదాలో ఉన్న మోడీ..వీటిని హైలెట్ చేసి, ప్రముఖంగా ప్రస్తావించడం సరికాదన్న భావనలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల సెంటిమెంట్, భక్తిని.. ఇలాంటి చోట్ల మిళితం చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

## సంపాదకీయం

బుధవారం 20-03-2024

# నీటి వృథాతోనే నగరాల వ్యథ

ఆహారం లేకుండా పాటు మనం ఉండగలమేమో గానీ, నీరు లేకుండా ఎక్కువసేపు జీవించలేం. అంతటి విలువైన నీటిని ఎంత జాగ్రత్తగా వాడుకోవాలి. కానీ, మనం చేస్తున్నదేమిటి? ఒక్క హైదరాబాద్‌లోనే చూసుకుంటే.. ఈ రోజు 1.30 కోట్ల మంది రోజు సుమారు 448 మిలియన్ గ్యాలన్ల (203 కోట్ల లీటర్లు) నీటిని వాడుతున్నారు. అందులో 30 మిలియన్ గ్యాలన్ల (13 కోట్ల లీటర్లు) నీరు వృథా అవుతుండటం ఆందోళనకరం. ఒక కిలో లీటర్ నీటిని కృష్ణా, గోదావరి నదుల నుంచి నగరానికి తీసుకురావడానికి సుమారు రూ.45 వరకు ఖర్చవుతోంది. అంటే ఈ లెక్కన.. 13 కోట్ల లీటర్లకు ఎంత అవుతుందో అర్థం చేసుకోవాలి. ఖర్చు సంగతి పక్కనపెడితే.. వృథా అవుతున్న నీటి విలువను వెలకట్టగలమా? గుక్కెడు నీటి కోసం పరితపించేవారికే ఆ విలువ తెలుస్తుంది. పైపుల ద్వారా సరఫరా అయ్యే నీటిలో సుమారు 40 శాతం వృథా అవుతున్నట్లు పలు నివేదికలు ఉన్నాయి. మంచినీటి దుర్వినియోగం ఇలాగే కొనసాగితే 2040 నాటికి మన దేశ జనాభాలో 40 శాతం మందికి తాగునీరే దొరకదు. 2050 నాటికి జీడీపీలో భారత్ 6 శాతాన్ని కోల్పోతుందని ఓ అంచనా. భవిష్యత్తులో ఢిల్లీ సహా 21 నగరాల్లో భూగర్భ జలాలు కనుమరుగవుతున్న నీటి నిర్వహణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇష్టారాజ్యంగా నీళ్లను వృథా చేయడమే దేశంలో నీటి కటకటకు ప్రధాన కారణమని సెంట్రల్ వాటర్ కమీషన్ చెబుతున్నది. ప్రపంచంలోని దాదాపు 150 దేశాలు తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి వరల్డ్ రిసోర్స్ ఇన్‌స్కామ్ నివేదిక ద్వారా తెలుస్తున్నది. ఈ జాబితాలో ఖతార్, ఇరాన్, కువైట్, యూఏఈ, ఇజ్రాయెల్, లెబనాన్‌తో పాటు మన దేశం కూడా విచారకరం. ఆస్ట్రేలియా, యూకే, దక్షిణాఫ్రికా దేశాలు నీటి వృథాను అరికట్టడాన్ని తమ జాతీయ ఎజెండాలో చేర్చాయి. వాననీటి సంరక్షణలో జర్మనీ ఇతర దేశాలకు పాఠాలు నేర్పుతున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో సింగపూర్ వాటర్ మేనేజ్‌మెంట్ నుంచి మనం ఎంతో నేర్చుకోవాలి. కేసీఆర్ సర్కార్ దూరదృష్టితో తీసుకున్న చర్యల కారణంగా గత పదేండ్లు తెలంగాణ జలకళను సంతరించుకున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అనేక పంట కాలువలు, చెరువులు, కుంటలు వేసవిలోనూ నీటితో కళకళలాడాయి. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన నాటినుంచి తొమ్మిదిన్నరేండ్ల పాటు నీటి సంక్షోభం అనే మాటే లేదు. కానీ, ప్రస్తుతం తెలంగాణలో కరువు తాండవిస్తున్నది. పంటలు ఎండిపోతున్నాయి. నీటి కోసం మహిళలు రోడ్డెక్కుతున్నారు. అనతికాలంలోనే ఎందుకిలా జరుగుతోంది? హైదరాబాద్‌కు తాగునీరందించే ప్రాజెక్టులు ఒక్కొక్కటిగా ఖాళీ అవుతున్నాయి. నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీకి చేరుకున్నది. ఎమర్జెన్సీ పంపింగ్‌పైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొన్నది. అటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టులు నిండుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉన్నది. నీటి వృథాను అరికట్టాలి. జల సంరక్షణ మనందరి బాధ్యత. చెన్నై, బెంగళూరు నగరాల దుస్థితి మనకు రాకూడదంటే ఇప్పటినుంచే నీటి వృథాను అరికట్టాలి. పాలకులు మేల్కొవాలి.

# సార్వత్రిక సమరంలో తొలిసారి ఓటు వేసే యువతే కీలకం

న్యూఢిల్లీ,ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు ఏడు విడతల్లో జరగనున్న పోలింగ్‌లో పాల్గొనే 'తొలిసారి ఓటు వేసే ఓటర్లు' కీలకం కానున్నారు. ఓటు వేయనున్న మొత్తం ఓటర్ల సంఖ్య 97.8 కోట్లు. ఇందులో కొత్త ఓటర్లు 1.90 కోట్లు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనిని బట్టి చూస్తే తొలిసారి ఓటు వేసే యువ భారతం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయనున్నారా అనిపిస్తుంది. తొలిసారిగా ఓటు హక్కు పొందిన యువత తమ ఓట్లను సద్వినియోగం చేసుకొని, ఉత్తమ నాయకులను పార్లమెంటుకు ఎన్నుకొని 18వ లోక్‌సభకు పంపించడం ద్వారా తమ కోరికలు, ఆశయాలు నెరవేర్చే నాయకులను ఎన్నుకోగలిగితే ప్రపంచంలో గొప్ప ప్రజాస్వామ్య దేశంగా నిలవవచ్చు. 25 ఏండ్ల లోపు వయస్సు కలిగిన జనాభా 60% ఉన్న మన దేశంలో యువ ప్రభంజనం కొనసాగుతుంది. దేశ ప్రజాస్వామ్య యువత పరిరక్షకులుగా, దేశోద్ధారకులుగా నిలబడగలిగితే దేశంలోని ప్రధాన సమస్యలన్నింటికీ సమాధానాలు దొరక్క నమ్మవచ్చు. దేశంలో ఉన్న 97.8 కోట్ల ఓటర్లలో 49.72 కోట్ల మంది ఓటర్లు పురుషులు, 47.1 కోట్ల మంది మహిళలు నమోదు అయ్యారు. 1.89 కోట్ల మంది తొలిసారి ఓటర్లుగా 18- 19 ఏళ్ల వయసు గల ఓటర్లు 85 లక్షలుగా మిగిలిన వారు ఇతర వయసు గల వారు ఎన్నికల కమిషన్ ప్రకటించారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో 91.2 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 61.5 కోట్ల మంది అంటే 67.4% ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి ఓటు హక్కు వినియోగించుకునే వారి శాతం పెంచడానికి అనేక రకాల అవగాహన కార్యక్రమాలు జరిగాయి. వయో వృద్ధులు, వికలాంగులు ఓటు వేయడానికి పడుతున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కమీషన్ వారి ఓటు వినియోగం కోసం తమ ఉద్యోగుల ఇంటి వద్దకే పంపించే చర్యల వల్ల పోలింగ్ శాతం పెరుగుతుంది. సాధారణంగా యువతలో తమ భవిష్యత్తు అవసరాల పట్ల స్పష్టత, ఆలోచించి ఓట్లు వేయడం, ఇతర ఓటర్లను అధికంగా ప్రభావితం చేయడం, గళమెత్తి నినదించడం, ప్రచారంలో దూసుకుపోవడం లాంటి వాటి వల్ల తొలిసారి ఓటు వేయనున్న యువతను దృష్టిలో పెట్టుకొని అభ్యర్థులు ప్రత్యేక ప్రణాళికలు, తమ మేనిఫెస్టోలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు.



ఇటీవల ఎన్నికల విశ్లేషణ ప్రకారం ఓటు హక్కు వినియోగించుకోవడంలో పురుషుల కన్నా మహిళలు, గిరిజనులు, వికలాంగులు, వృద్ధులు ముందంజలో ఉన్నట్లు గమనించిన నాయకులు ఇలాంటి ఓటర్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నారు. పట్టణ ఓటర్ల కంటే గ్రామీణ భారతంలో ఉన్న ఓటర్లు అధిక శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలుస్తోంది. 1989లో జరిగిన 61వ రాజ్యాంగ చట్ట సవరణ ఆధారంగా ఓటు హక్కు వయస్సు 21 నుంచి 18 ఏండ్లకు తగ్గించడం వల్ల యువతకు పరిపక్వ ఆలోచనలు, స్వతంత్రంగా సరైన నిర్ణయాలు తీసుకునే జ్ఞానం వస్తుందని నమ్మకంతో తగ్గించినట్లు భావించవచ్చు. కాబట్టి వారిని పోలింగ్ బూత్‌కు రప్పించడానికి,మంచి నాయకుడిని ఎన్నుకొనేలా ప్రోత్సహించడానికి భారత ఎన్నికల కమీషన్ వినత్న అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఓటు ప్రాధాన్యతను వివరించడం, ప్రతి ఒక్కరూ వేటు వేసేలా ప్రోత్సహించేలా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. కళాశాల యువతకు అవగాహన కల్పించడం, ఓటర్లుగా నమోదు చేసుకోవడం, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించడం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఓటర్ల నమోదును ఉద్యమంగా చేపట్టి అర్హులైన యువతకు ఓటు హక్కు కల్పించే ప్రయత్నాలు చేశారు. ఇంతటి ప్రాధాన్యత పొందిన యువత నూరు శాతం ఓటు హక్కును వినియోగించుకొని భావిభారత నిర్మాణ సహకరిస్తారని ఆశిద్దాం.

# అవినీతికి రీ'ఫండ్'




హైదరాబాద్ : రాష్ట్రంలో జిఎస్‌టి రీఫండ్‌ల ముసుగులో కొందరు అక్రమార్కులు ప్ర భుత్వ ఖజానాకు భారీ మొత్తంలో గండి కొట్టారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే కమీషన్‌లకు కక్కుర్తిపడి గత ప్రభుత్వ హయాంలో 2022 జూలై నుండి 2023 నవంబర్ వరకు అనర్హులకు జిఎస్‌టి రీఫండ్లు ఇచ్చినట్టుగా వాణిజ్య పన్నుల శాఖను పేర్కొంది. తప్పుచేసిన ఒకరిద్దరు డీలర్లు అధికారులపై ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటపడింది. దీంతో అప్రమత్తమైన వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టి.కె. శ్రీదేవి అధికారులతో సమీక్షలు నిర్వహించి బోగస్ సంస్థలకు విచారణకు ఆదేశించింది. ఇప్పటికే ఈ కేసుతో సంబంధం ఉన్న అధికారులకు నోటీసులు ఇవ్వడంతో పాటు సీనియర్ అధికారులతో విచారణ చేపట్టారు. ఈ బైక్‌ల తయారీ, టాల్కమ్ పౌడర్ ఉత్పత్తి సంస్థల మాటున రాష్ట్రంలో ఈ బైక్‌ల తయారీ, టాల్కమ్ పౌడర్ ఉత్పత్తి సంస్థల మాటున కొందరు అక్రమార్కులు ప్రభుత్వ సొమ్మును భారీగా జేబులో వేసుకున్నారు. నెల నెలా జీతం తీసుకున్న అధికారులు సైతం అక్రమార్కులతో చేతులు కలిపి కమీషన్లకు ఆశపడి ఇష్టానుసారంగా రీఫండ్లు ఇచ్చినట్టు వాణిజ్య పన్నుల శాఖ విచారణలో తేలింది. రాష్ట్రంలో మొత్తంగా 14 డివిజన్లు ఉంటే ఈఫండ్‌ల బాగోతం ఎక్కువగా హైదరాబాద్‌లోని మాదాపూర్ డివిజన్ పరిధిలో ఎక్కువగా జరిగింది. డిప్యూటీ కమిషనర్ నుంచి కింది స్థాయి డిసిటిఓ వరకు కమీషన్ల పంపకం జరిగినట్లుగా కనిపిస్తోంది. ప్రాథమిక అంచనా ప్రకారం మూడు నుంచి నాలుగు కేసుల్లో దాదాపు రూ.100కోట్ల ప్రభుత్వ సొమ్ము అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లినట్లు సమాచారం.

**బోగస్ సంస్థలను ఏర్పాటు చేసి...జిఎస్‌టి లైసెన్స్‌లను తీసుకొని**

%ఈ బైక్ అమ్మకాలను ప్రోత్సాహించడానికి కేంద్ర ప్రభుత్వం 5 శాతం జిఎస్‌టి మాత్రమే వాటిపై వేస్తోంది. దీనిని ఆసరాగా చేస్తున్న అనేక అక్రమార్కులు బోగస్ సంస్థలను ఏర్పాటు చేశారు. వాటి తయారికి జిఎస్‌టిలైసెన్స్‌లను తీసుకున్నారు. కాగా ఈ లైసెన్స్ ఇచ్చే ముందు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అది చేయకుండానే లైసెన్స్ ఇచ్చారు. ఆ తరువాత ఆ సంస్థ వ్యాపారం చేస్తుందో లేదో తెలుసుకునే ప్రయత్నం కూడా అధికారులు చేయలేదు. అక్రమార్కులు బయట నుంచి ఈ బైక్ విడిభాగాలు తీసుకొచ్చినట్లుగా, వాటి విలువపై 18 శాతం జీఎస్టీ చెల్లించినట్లు ఇన్‌వాయిస్‌లను సృష్టించి వాటిని అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఆ తరువాత విడిభాగాలను అసెంబుల్ చేసి ఈ బైక్‌లను విక్రయించినట్లు చూపించారు. ఈ బైక్‌ల విలువపై 5 శాతం జిఎస్‌టితో అమ్మినట్లు బిల్లులు సృష్టించారు. అయితే విడిభాగాల విలువపై చెల్లించిన 18 శాతం జిఎస్‌టిలో ఈ బైక్‌ల విలువపై వచ్చిన 5 శాతం నగదు మినహాయించి మిగిలిన 13 శాతం నగదును ప్రభుత్వ ఖజానా నుంచి రీఫండ్ కింద తీసుకోవడానికి కేంద్రం జీఎస్టీ చట్టంలో వెసులుబాటు కల్పించింది. దీనినే అక్రమార్కులు ఆసరాగా చేసుకున్నట్టు ఆ శాఖను పేర్కొన్నారు.

**కాగితాల మీదనే వ్యాపారం కావడంతో అందినంత లంచం**

డీలర్లు రీఫండ్‌కు దరఖాస్తు చేసుకుంటే పూర్తి స్థాయిలో పరిశీలన చేసుకునేందుకు కేంద్రం పూర్తి స్థాయిలో మార్గదర్శకాలను ఉంచింది. అదే విధంగా వాటికి అనుగుణంగా వాణిజ్య పన్నుల శాఖ కూడా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ వాటాలను పూర్తిగా తీసుకుని, దరఖాస్తుదారు నివేదించిన వివరాలు కచ్చితమని నిర్ధారించుకున్న తరువాతనే రీఫండ్లు అందించాలి. కానీ, ఇక్కడ అది జరగలేదు. కోటి రూపాయలు రీఫండ్ ఇస్తే రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కమీషన్లు తీసుకున్నట్లుగా ఆ శాఖను పేర్కొన్నారు. వ్యాపారం చేసే డీలర్లు అయితే ఇంత కమీషన్లు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. కానీ, ఇక్కడ రూపాయి పెట్టుబడి పెట్టకుండా కాగితాలపై బోగస్ కంపెనీలను సృష్టించి ప్రభుత్వ సొమ్మును దోచేయడంతో అధికారులు అడిగినంత కమీషన్ ఇచ్చి వాటిని సమర్పించుకున్నారు. ఈ వ్యవహారమంతా గత ప్రభుత్వ హయాం 2022 జూలై నుంచి నవంబరు 2023 వరకు కొనసాగడం విశేషం.

**అధికారులపై ఎందుకు చర్య తీసుకోలేదు..?**

మాదాపూర్ సర్కిల్ పరిధిలోని ఓ అధికారిని 2022 నవంబర్ నుంచి 2023 ఆగస్టు వరకు ఓ బోగస్ డీలర్ రూ.14 కోట్లుపైగా రీఫండ్ ఇచ్చారు. అదే విధంగా మరో అధికారి 2022 ఏప్రిల్ నుంచి 2023 ఆగస్టు వరకు దాదాపు రూ.26 కోట్లు మరో బోగస్ డీలర్‌కు, ఇంకో అధికారి 2022 నవంబర్ నుంచి ఆగస్టు వరకు ఇంకో బోగ డీలర్‌కు దాదాపు రూ.19 కోట్ల రీఫండ్‌లు ఇచ్చారు. ఈ ముగ్గురు అధికారులు కలిసి దాదాపు రూ.100 కోట్లు మేర అనర్హులకు ప్రభుత్వ సొమ్మును దోచి పెట్టారు. డీలర్ల నుంచి భారీ మొత్తంలో అధికారులు కమీషన్లు తీసుకున్నారు. ఈ మధ్యలో పంపకాల్లో తేడా రావడంతో ఈ వ్యవహారమంతా బయటపడింది. ఓ అధికారి ఇక్కడ నుంచి నల్గొండ డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఎక్కడ తన అవినీతి భాగోతం బయట పడుతుందోనన్న భయంతో పాటు తనకు రావాల్సిన కమీషన్లు వేరొకరికి పోతాయన్న భావనతో ఏకంగా ఆ డీలర్ చిరునామా తన పరిధిలోకి మారినట్లు చూపి రీఫండ్ ఇచ్చినట్లుగా ఉంది. అయితే ఓ అధికారి చేసిన నిర్వాకం బయటకు పొక్కడంతో ఆ అధికారి ఓ డీలర్‌కు నోటీసు ఇచ్చి పిలిపించారు. ఆ డీలర్ రూ.65 లక్షలు చెల్లించి మిగిలిన సొమ్ము తన ఆస్తులు అమ్మి చెల్లిస్తానని కొంత సమయం కావాలని కోరినా వినకుండా అరెస్టు చేసి రిమాండ్‌కు. ఆ డీలర్ బెయిల్‌పై బయటకు వచ్చి ఈ అవినీతి భాగోతంపై ఫిర్యాదు చేశారు. తప్పుడు బిల్లులు పెట్టి రీఫండ్ తీసుకున్నందుకు తాను ఆ మొత్తాలను చెల్లిస్తానని చెప్పినా వినకుండా తనను అరెస్టు చేశానని, ఎందుకు తప్పుడు ఇన్లు పెట్టి రీఫండ్ ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోలేదని ప్రశ్నించడంతో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న వ్యవహారం బయటకు వచ్చింది.

# గ్రూప్ పరీక్షల వాల్యువేషన్‌పై బుకాయింపులా

అమరావతి,గ్రూప్ 1 మెయిన్స్ వాల్యూయేషన్ మూడు సార్లు జరిగితే ఒక్కసారే చేశామని గౌతమ్ సవాంగ్ బుకాయించటం సిగ్గుచేటని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం మండిపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. అక్రమంగా మూడుసార్లు మూల్యాంకనం జరిగిందని అన్నీ ఆధారాలు పరిశీలించే కోర్టు పరీక్షలు రద్దు చేసిందన్నారు. తప్పుచేసి కూడా నిస్సిగ్గుగా బుకాయిస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ స్కాంపై తామిచ్చిన ఆధారాలు చూసి గవర్నర్ కూడా ఆశ్చర్యపోయారన్నారు. తన వద్ద ఉన్న ఆధారాలతో వస్తానని.. మీడియా సమక్షంలో సవాంగ్ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. తప్పు చేసి కూడా ఇంకా బుకాయించటం ఏంటి అని నిలదీశారు. ఏపీపీఎస్సీ చైర్మన్‌గా కొనసాగే అర్హత సవాంగ్‌కు లేదన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతాయుతమైన పదవి నిర్వర్తించిన సవాంగ్ ఈ విధంగా బుకాయించటం దిగజారుడుతనానికి పరాకాష్ట అని వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ తొలగించముందే సవాంగ్ రాజీనామా చేస్తే గౌరవ ప్రదంగా ఉంటుందని సూచించారు. నేడు జరుగుతున్న ఏపీపీఎస్సీ పరీక్షలు సవాంగ్ చైర్మన్‌గా పారదర్శకంగా నిర్వహిస్తారని ఎలా నమ్మాలని అడిగారు. నిన్న జరిగిన ప్రిలిమ్స్ వాల్యూయేషన్‌లో అవకతలు జరగవని గ్యారెంటీ ఉందా? అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఏపీపీఎస్సీ గ్రూప్ 1 స్కామ్‌పై సీబీఐ విచారణ జరిపిస్తామన్నారు. రాష్ట్ర యువత జీవితాలతో ఆడుకున్న ఎవరినీ వదలిపెట్టమని కొమ్మారెడ్డి పట్టాభి హెచ్చరించారు.

## ప్రజల్లో జగన్ ఓడించాలన్న కసి

అమరావతి,బొప్పూడి సభలో రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న ప్రజాగ్రహం స్పష్టంగా కనిపించిందని.. వైసీపీని ఓడించాలనే కసితో ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారని టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ నరేంద్ర తెలిపారు. ప్రధానమంత్రి వచ్చే సభకు భద్రతా ఏర్పాట్లు చూడాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. అనువైన పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసినప్పటికీ పోలీసుల వైఫల్యం తో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయిందని నరేంద్ర

# తెలంగాణ వికాసం కోసం బిజెపికి ఓటేయండి

జగిత్యాల, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను ఓడించి తెలంగాణ వికాసం కోసం బీజేపీకి ఓటు వేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జగిత్యాలలో జరిగిన విజయసంకల్ప సభలో మోదీ మాట్లాడారు. తెలంగాణలో బీజేపీకి రోజురోజుకి ఆదరణ పెరుగుతోందన్నారు. మే13న తెలంగాణ ప్రజలు చరిత్ర సృష్టిస్తారని.. వికాసం కోసం బీజేపీకి ఓటు వేయాలన్నారు. జూన్4న వచ్చే ఫలితాల్లో ఎన్డీయే 400 సీట్లు గెలవాలని ఆకాంక్షించారు. తనకు మద్దతుగా నిలవాలంటే తెలంగాణలో కూడా సీట్లు గెలవాల్సి ఉందని అన్నారు. ప్రజలంతా తనకు మద్దతు కోసం బిజెపిని గెలిపించాలన్నారు. కరీంనగర్ నుంచి బండి సంజయ్‌ను, నిజామాబాద్ నుంచి ధర్మపురి అర్వింద్‌ను, పెద్దపల్లి నుంచి గోమాస శ్రీనివాస్‌లను గెలిపించాలని ప్రధాని పిలుపునిచ్చారు. వారిని ప్రజలకు పరిచయం చేశారు. విపక్షాల ఇండియా కూటమిలో ఐక్యత లేదన్నారు. కూటమిలో పార్టీలన్ని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారన్నారు. ముంబయిలో జరిగిన రాహుల్ గాంధీ న్యాయ జోడో యాత్రను ప్రస్తావిస్తూ.. విపక్షాల అనైక్యత ఆసభలో కనిపించిందని అన్నారు. రాహుల్‌గాంధీ శక్తిపై తమ పోరాటం అన్నారని.. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో జూన్ 4న తేలిపోతుందన్నారు. శక్తిని నాశనం చేయాలని విపక్ష కూటమి భావిస్తోందన్నారు. తెలంగాణ కలలను కాంగ్రెస్ నాశనం చేసిందన్నారు. కవిత అరెస్ట్‌పై మోదీ మొదటిసారి స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, అలాగే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కమిషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ప్రధాని తన ప్రసంగంలో మహిళలపై ప్రసంశలు కురిపించారు. ఉమెన్ పవర్ చాలా శక్తివంత మైనదన్నారు. మహిళలంతా తమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. మహిళా శక్తిని కాంగ్రెస్ ప్రభుత్వం హేళన చేస్తోందని. మహిళలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌరవం లేదని విమర్శించారు. తెలంగాణను బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని ప్రధాని మోదీ విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే పని చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి ప్రభుత్వాలేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ విచారణ చేయించడం లేదన్నారు. బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ కవర్ చేయాలని చూస్తోందని, తాము మాత్రం అవినీతి పరులను వదిలిపెట్టేది లేదని మోదీ వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పని తనను తిట్టడమేనని ప్రధాని మోదీ విమర్శించారు. రోజంతా మోదీని తిట్టడానికి వాళ్ల సమయం కేటాయిస్తున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ గ్యారంటీ ఉందన్నారు. కుటుంబ పార్టీలను ప్రజలు దూరంగా పెట్టాలన్నారు. దేశాన్ని దోచుకోవడమే కుటుంబ పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. తెలంగాణలో బిజెపికి మద్దతు పెరుగుతోందని కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు తగ్గుతుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు రాబోతున్నాయని, బిజెపికి 400పైగా సీట్లు రావడం ఖాయమని, బిజెపికి ఓటు వేయాలని తెలుగులో ప్రధాని మోడీ చెప్పారు. తెలంగాణలో బిజెపిని ఎంతగా గెలిపిస్తారో అంతగా తాను బలోపేతం అవుతానని, తెలంగాణలో బిజెపికి అధికారమిస్తే మరింతగా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. పసుపు రైతుల కోసం పసుపు బోర్డు తీసుకొచ్చామని, తెలంగాణలో లక్ష కోట్ల విలువైన ధాన్యం కొన్నామని పేర్కొన్నారు. గత మూడు రోజుల్లో తాను తెలంగాణకు రావడం ఇది రెండోసారి అని, తెలంగాణ కోసం రూ. వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, తెలంగాణలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఇటీవల శ్రీకారం చుట్టామన్నారు. తెలంగాణ నలుమూలల నుంచి బిజెపికి మద్దతు పెరుగుతోందన్నారు. మాల్కాజ్‌గిరిలో బిజెపి ర్యాలీలో ప్రజలు భారీగా పాల్గొని మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. శక్తి రూపంలో మహిళలు తనని ఆశీర్వదించేందుకు వచ్చారని, ఇది తన భాగ్యమని, శక్తిస్వరూపులైన ప్రతి మాత, సోదరి, కుమార్తెల కోసం పూజారిగా ఉన్నానని, శక్తిస్వరూపులైన మహిళల రక్షణ కోసం తాను ప్రాణాలు అర్పించేందుకు సిద్ధంగా ఉన్నానని మోడీ స్పష్టం చేశారు. తాను భారతమాత పూజారిని అని పేర్కొన్నారు. ఆంగ్లేయులు, రజాకార్లతో పోరాడిన నేల ఇది అని ప్రశంసించారు. కాంగ్రెస్ తెలంగాణ ఆశలను నాశనం చేసిందని, తెలంగాణ ప్రజలను బిఆర్ఎస్ దోచుకొని ద్రోహం చేసిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ తెలంగాణను తమ ఎటిఎంలాగా మార్చుకుందని, తెలంగాణ డబ్బు ఇప్పుడు ఢిల్లీ చేరుతోందని దుయ్యబట్టారు. ఒక దోపిడీదారు? మరో దోపిడీదారుపై పోరాటం చేయలేదని ప్రజలకు తెలుసునన్నారు. బిఆర్ఎస్ దోపిడీపై కాంగ్రెస్ మౌనం వహిస్తోందని దుయ్యబట్టారు. కాళేశ్వరం దోపిడీని కాంగ్రెస్ ప్రశ్నించడం మానేసి, బిఆర్ఎస్‌ను కాంగ్రెస్ కాపాడుతోందని మోడీ ధ్వజమెత్తారు. తెలంగాణను దోచుకున్న వారిని తాము విడిచిపెట్టేది లేదు అని, కుటుంబ పార్టీలు దేశాన్ని దోచుకునేందుకు రాజకీయాలు చేస్తున్నాయని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏ దోపిడీని పరిశీలించినా దాని వెనుక కుటుంబ పార్టీలే ఉన్నాయని, 2 జి స్పెక్ట్రమ్ కేసులో డిఎంకె పేరు బయటకు వచ్చిందని, అది కుటుంబ పార్టీ అని, నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పేరు బయటకు వచ్చిందని, అది కుటుంబ పార్టీ అని, ఇప్పుడు ఆ జాబితాలో కుటుంబ పార్టీ బిఆర్ఎస్ చేరిందని ధ్వజమెత్తారు. కుటుంబ పార్టీ అయిన బిఆర్ఎస్ కాళేశ్వరంలో అవినీతి చేసిందని, ఢిల్లీ మద్యం విషయంలోనూ బిఆర్ఎస్ అవినీతికి పాల్పడిందని ఆయన చురకలంటించారు. పదేళ్ల పాలనలో తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో బీఆర్ఎస్ ఆడుకుందని ప్రధాని మోదీ మండిపడ్డారు. తొలుత తెలుగులో ప్రసంగం ప్రారంభించిన మోదీ బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజల్లో ఉత్సాహం నింపారు. ఈ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, సీనియర్ నేతలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, ఇతర కీలక నేతలు హాజరయ్యారు. రాష్ట్రంలో బీజేపీకి మద్దతు పెరిగిందన్న మోదీ.. మే 13న తెలంగాణ ప్రజలు కొత్త చరిత్ర సృష్టించబోతున్నారని అన్నారు. 'దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం. భారత్ అభివృద్ధి చెందితేనే తెలంగాణలోనూ అభివృద్ధి జరుగుతుంది. బీఆర్ఎస్ పై ప్రజలకు ఉన్న ఆగ్రహం గత అసెంబ్లీ ఎన్నికల్లో బయటపడింది. తెలంగాణ అభివృద్ధికి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. మాకు అధికారం కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యం.' అని మోదీ పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ పని అయిపోతుందని మోదీ అన్నారు.

## అకాల వర్షాలతో అన్నదాతల ఆందోళన


వరంగల్,అన్నదాతలను ప్రకృతి పగబట్టింది. వాతావరణంలో ఏర్పడిన మార్పులు రైతులను కలవరపెడుతున్నాయి. చేతికందిన పంట వర్షార్పణం అయిపోతుండటంతో రైతులు దిగులుతో తలలు పట్టుకుంటున్నారు. మిర్చి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అసలే ఈ ఏడాది మిర్చికి సరైన ధర లేక తలలు పట్టుకుంటున్న రైతులకు ఇప్పుడు వాతావరణ ప్రతికూల పరిస్థితులు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. చేతికి అందిన వరి, మిర్చి పంటను కాపాడుకోవడం కోసం పడరానిపాట్లు పడుతున్నారు రైతన్నలు. కలాల్లో అరబోసిన మిర్చి పంటను పాలిథిన్ కవర్లతో కప్పి వర్షంలో తడవకుండా కాపాడు కుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుండి వాతావరణంలో మార్పులు సంభవించాయి. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టడం మాతరం కాదు

హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టడం ప్రధానమంత్రి నరేంద్రమోదీ తరం కాదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం నాడు గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని మోడీ జగిత్యాల సభలో పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని మాట్లాడడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వాలను కూలగొట్టడమే లక్ష్యంగా బీజేపీ పనిగట్టుకుందని మండిపడ్డారు. పార్టీలో చేరడానికి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఎవరు ముందుకు వచ్చినా పార్టీలో చేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరితే గులాబీ నేతలు గగ్గోలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు గులాబీ పార్టీ నేతల తీరు ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చిన చరిత్ర కేసీఆర్ పార్టీదని చెప్పారు. తమ ప్రభుత్వాన్ని కూల్చుతామని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కలలు కంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఐదేళ్లు ఎలా కొనసాగించాలో తమకు తెలుసునని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తారని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.అయితే బీఆర్ఎస్ నేతల పై కాంగ్రెస్ పార్టీకి చెందిన పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శించారు. పదేళ్ల పాటు విచ్చలవిడిగా ఫిరాయింపులను ప్రోత్సహించింది కేసీఆర్ కాదా..? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీ చివరకు సీపీఐ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టి బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకోలేదా..? అని మండిపడ్డారు. తెలంగాణ పునర్ నిర్మాణం పేరుతో శాసనసభ్యులను చేర్చుకున్నది మీరు కాదా..? పదేళ్లలో ఇతర పార్టీల నుంచి మొత్తం 39 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ చేర్చుకుందని ఎమ్మెల్యే తెలిపారు. 2014లో 23 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ చేర్చుకుందని.. ఇందులో టీడీపీ నుంచి 12 మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, వైసీపీ నుంచి ముగ్గురు, బీఎస్పీ నుంచి ఇద్దరు, సీపీఐ నుంచి ఒకరిని చేర్చుకున్నారని ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి తెలిపారు. 2018లో 16 మందిని చేర్చుకోలేదా..? అని ప్రశ్నించారు. కేటీఆర్, హరీష్ రావు ప్రతిపక్ష ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ తిరిగి ప్రలోభపెట్టింది మరిచిపోయారా అని అన్నారు. టీడీపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే తలసానితో రాజీనామా చేయించకుండా మంత్రి వర్గంలోకి తీసుకోలేదా..? అని పేర్కొన్నారు. కాంగ్రెస్ లో గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని మీ మంత్రివర్గంలోకి తీసుకోలేదా.. అప్పటి స్పీకర్లు మధుసూదనాచారి, పోచారం శ్రీనివాస్ రెడ్డి అనర్హత పిటిషన్ల పైన చర్యలు తీసుకున్నారా..?అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని కూల్చడానికి బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు చేశారని ఆరోపించారు. ప్రమాణస్వీకారానికి ముందే కడియం శ్రీహరి ప్రభుత్వం కూలిపోతుందన్నారు.. త్వరలో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతాడని కేటీఆర్ అనలేదా అని ప్రశ్నించారు.

# తెలుగు రాష్ట్రాల్లో మోడీ జోష్

హైదరాబాద్,సార్వత్రిక ఎన్నికల నగారా మోగడం ఆలస్యం...బిజెపి రంగంలోకి దూకింది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో మోడీ పర్యటనతో జోష్ నింపింది. ఏకకాలంలో రెండు రాష్ట్రాల్లో మోడీ సభలు విజయవంతం అయ్యాయి. మల్కాజిగిరిలో రోడ్ షోతో మొదలు, నాగర్ కర్నూలు, జగిత్యాలలో భారీ బహిరంగ సభలు నిర్వహించారు. అలాగే ఎపిలో కూడా మోడీ శంఖారావం పూరించారు. టిడిపి-జనసేన కూటమితో కలసి తొలిసారిగా ఎన్నికల రంగంలోకి దిగారు. మోడీ రాకతో బిజెపి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అలాగే చేరికలను కూడా బిజెపి ప్రోత్సహిస్తోంది. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరేవారితో బిజెపి కొంత బలం పుంజుకుంది. మోడీ గ్యారెంటీ పేరుతో ఎక్కడికి వెళ్లినా ప్రధాని మోడీ మార్మోగిస్తున్నారు. జైభారత్, జైశ్రీరామ్ నినాదాలు మోగిస్తున్నారు. ప్రజలు కూడా మోడీపట్ల సానుకూలతనే ప్రకటిస్తున్నారు. స్థానికంగా బిజెపికి ఎలాంటి బలం లేకున్నా మోడీ మేనియా ఉందనడంలో సందేహం లేదు. ఇకపోతే సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలతో బిజెపి తిరుగులేని ఆధిపత్యం సాధించింది. బిజెపికి ప్రత్యామ్నాయం అంటూ తొడగొట్టిన పార్టీలన్నీ చతికిల పడ్డాయి. మోడీ, అమిత్ షాల వ్యూహం ముందు ఇప్పుడు ఎవరి వ్యూహం పనిచేయడం లేదు. ఈ క్రమంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాలు ఎలాంటి వ్యూహం అనుసరిస్తాయన్నదే ముఖ్యం. ఎందుకంటే మోడీ వ్యూహం ఇప్పటికే సిద్ధం అయి ఉంటుంది. అది ఏంటన్నది త్వరలో బయటకు రానుంది. ఈ క్రమంలో విపక్షం నుంచి ఉమ్మడి ప్రధాని అభ్యర్థిగా ఎవరు ఉంటున్నది ఆసక్తిగా మారింది. కాంగ్రెస్‌తో కలసి ఉమ్మడి ప్రధాని అభ్యర్థిని ప్రకటించే విషయంలో ఏ ఒక్క పార్టీ కూడా ఇప్పటికీ ప్రయత్నాలు మొదలు పెట్టలేదు. ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు చేస్తామని ప్రకటించిన కెసిఆర్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో చలతికిల పడ్డారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు తరవాత అనూహ్యంగా బీహార్ సిఎం నితీశ్ కుమార్ మరోమారు ఎన్డీఎ గూటికి చేరడంతో ఇండియా కూటమి బలహీనపడింది. ఎపిలో జగన్ ప్రభుత్వం తీరుపై మోడీ తొలిసారిగా ఘాటు విమర్శలు చేశారు. తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతిపైనా మోడీ విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో మరోసారి పీఠమెక్కడానికి బిజెపి సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు ఇదే సరైన సమయం అయినా అది గట్టిగా నిలబడలేక తంటాలు పడుతోంది. ఎన్నికల్లో ఎన్‌డిఎకు గట్టి పోటీ ఇస్తారా లేదా అన్నది చూడాలి. విపక్షాలు ఐక్యతకు కూడా ఇదో పరీక్ష. ఇక్కడి నుంచే ఇక ఉమ్మడి ఎజెండాతో ముందుకు సాగితే సానుకూల అవకాశాలు ఉంటాయి. మోడీని ఎన్నికల్లో మాత్రమే ఎదరించకుండా..మోడీ విధానాలను ఎదరించేందుకు ఇక నిరంతరంగా శ్రమించాల్సిన బాధ్యతను తీసు కుంటే తప్ప ప్రజలు నమ్మరు. అందుకు ప్రాంతీయ పార్టీలు అనుసరించే వ్యూహం ఏంటన్నది మున్ముందు బయటపడనుంది. ఇదిలావుంటే లోక్‌సభ ఎన్నికలు తెలంగాణలోని మూడు ప్రధాన పార్టీలకూ విషమ పరీక్షగా ఉండబోతున్నాయి. దశాబ్దం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సుస్థిరంగా కొనసాగాలంటే ఆ పార్టీ కనీసం ఓ పది లోక్‌సభ సీట్లు గెలవగలగాలి. లేకుంటే కష్టమే కాగలదు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే ఇప్పుడు ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని కొట్టేయాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీ, తన ఆకాంక్ష



నెరవేరాలంటే కనీసం ఐదారు స్థానాలు గెలుచుకోవాలి. మూడు నెలల క్రితం అధికారాన్ని కోల్పోయిన భారత రాష్ట్ర సమితి విచిత్రమైన పరిస్థితిలోకి జారిపోయింది. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం రెండు మూడు స్థానాలైనా గెలుచుకొని సగం పైగా స్థానాలలో ద్వితీయ స్థానంలో నిలబడని పక్షంలో ఆ పార్టీ మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం భారత రాష్ట్ర సమితి ఒకటి రెండు స్థానాలైనా గెలుస్తుంది అన్న ప్రశ్న రాజకీయ పరిశీలకుల నుంచి వినిపిస్తోంది. ఎందుకంటే ఆ పార్టీలో ఇప్పుడు పోటీకి అభ్యర్థులు వెనక్కి తగ్గారు. దక్షిణ తెలంగాణలోని కొన్ని స్థానాలలో ఆ పార్టీ ద్వితీయ స్థానానికే పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రధాన పోటీ కాంగ్రెస్-బీజేపీ మధ్యనే కేంద్రీకృతం అయిందన్న అభిప్రాయం బలంగా వ్యాపిస్తోంది. మరోవైపు బిఆర్ఎస్ నుంచి ఎంపిలు, ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. అలాగే సిట్టింగ్ ఎంపీలు కొందరితో పాటు మాజీ ఎంపీలు సైతం పార్టీని వదిలి బీజేపీలో చేరుతున్నారు. ఎన్నికల వరకు ఎమ్మెల్యేలు అందరూ ఐక్యంగా పార్టీకి అండగా ఉంటారా? అన్న సందేహాలు కూడా మొదలయ్యాయి. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ముఖ్యులతో టచ్‌లోకి వెళ్లారు. దానం లాంటి వారు అడుగేశారు. కాంగ్రెస్ గేట్లు తెరిచిందని సిఎం రేవంత్ ప్రకటించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకొనే విషయంలో ఇంతకాలం విముఖంగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాజాగా మనసు మార్చుకున్నట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం సుస్థిరంగా ఉండాలంటే పార్టీ బలాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని ఆయన గుర్తించారు. గతంలో కేసీఆర్‌కు కూడా ఇలాగే వ్యవహరించి తోవచూపారు. ఇకపోతే జగన్ సర్కార్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన తొలి సభ సక్సెస్ అయ్యింది. ఏపీ సీఎం జగన్ అధికారం, డబ్బు అండతో విర్రవీగుతున్నారని మూడు పార్టీల నేతలు విరుచుకుపడ్డారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండలం బొప్పూడిలో ఏర్పాటు చేసిన 'ప్రజాగళం' బహిరంగ సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాబోయేది కూటమి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఇసుక తవ్వకాలతో సీఎం జగన్ బినామీలు రూ.40 వేల కోట్లు దోచేశారు. రాష్ట్రం డ్రగ్స్ కు రాజధానిగా మారింది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి దిగజారిపోయింది. ఏపీకి రావాల్సిన ఎన్నో పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. ఇలా జగన్ అవినీతి వల్ల ఎపి అభివృద్ధి వెనక్కి పోయిందని విరుచుకుపడ్డారు. మొత్తంగా టిడిపి కూటమిలో మోడీ రాకతో జోష్ నిండింది. రెండు రాష్ట్రాల్లో మోడీ మేనియా ఏ మేరకు పనిచేస్తుందో చూడాలి.

# ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో పరువు తీసారు

జగిత్యాల,తెలంగాణలో అత్యధిక స్థానాలకు కైవసం చేసుకునేందుకు బీజేపీ పక్కా వ్యూహంతో ముందుకువెళ్తోంది. దీనిలో భాగంగా జగిత్యాల వేదికగా బీజేపీ విజయసంకల్ప సభను నిర్వహించింది. జగిత్యాల విజయసంకల్ప సభలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణను దోచుకున్నది చాలదన్నట్లు మద్యం కుంభకోణంతో తెలంగాణ పరువు తీశారని ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజం తలదించుకునేలా..కేసీఆర్ కుటుంబం వ్యవహరించిందంటూ మండిపడ్డారు. పదేళ్లు కెసిఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుందని.. కేసీఆర్ కుటుంబం భారీగా అవినీతికి పాల్పడిందని తెలిపారు. తెలంగాణను దోచుకున్నది చాలక.. ఢిల్లీ వెళ్లి లిక్కర్ స్కామ్ చేశారంటూ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి.. మాట తప్పిందని మండిపడ్డారు. ఒకటో, రెండో గ్యారంటీలు అమలు చేసి.. మొత్తం చేశామని అబద్ధాలు చెప్పడం కాంగ్రెస్‌కే చెల్లిందని ఆరోపించారు. గ్యారంటీల కాంగ్రెస్ మోసం చేసిందంటూ విమర్శించారు. నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకుసాగుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు నుంచి.. రామమందిరం నిర్మాణం వరకు ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు కాబోతుందని రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జగిత్యాలలో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయసంకల్ప సభలో ఆయన మాట్లాడారు. వంద రోజుల పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రేవంత్ కేసీఆర్‌ను మరిపిస్తున్నారని ఎ÷-దదెవా చేశారు.కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. వంద రోజులు గొప్ప పాలన అందిచా.. పీసీసీ చీఫ్‌గా తన సత్తా చూపిస్తానంటున్నారని.. ఇదే మాటకు రేవంత్ కట్టుబడి ఉండాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 14 సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ చెబుతోందని.. ఈ సవాల్‌కు రేవంత్ కట్టుబడాలని లక్ష్మణ్ కోరారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా తీసుకుని రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత తీసుకోవాలన్నారు. దేశంలో కాంగ్రెస్ లేదని, రానున్న రోజుల్లో తెలంగాణలోనూ ఆ పార్టీ కనిపించదని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్న రేవంత్ ఆరోపణలు అవాస్తవమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాము పడగొట్టబోమని, పడిపోతే కాపడబోమని చెప్పారు. తాము గేట్లు తెరిచామంటున్నారని.. జాగ్రత్తగా చూసుకోవాలని.. మీ ఎమ్మెల్యేలు పారిపోయేలా ఉన్నారు కాపాడుకోవాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని, డబుల్ ఇంజిన్ సర్కార్ రాబోతుందన్నారు.

# గెలిపించకపోతే రక్తపాతమే

వాషింగ్టన్: నవంబర్ 5న జరగనున్న ఎన్నికలు అమెరికా చరిత్రలో నిలిచిపోనున్నాయని, తాను తిరిగి అధికారంలోకి రాకపోతే దేశంలో 'రక్తపాతం' మొదలవుతుందని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఈసారి తాను గెలవక పోతే బహుశా అమెరికాలో మరోసారి ఎన్నికలు ఉండబోవని అన్నారు. అమెరికా అధ్యక్ష పీఠం కోసం జో బైడెన్‌తో పోటీకి సిద్ధమైన డొనాల్డ్ ట్రంప్ ఒహైయోలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బైడెన్ విధానాలను తీవ్రంగా ప్రదర్శించారు.

చైనా కార్లను అనుమతించేది లేదు

మెక్సికోలో కార్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నారు చైనా నిర్ణయాన్ని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. తాను అధికారం లోకి వస్తే అక్కడ ఉత్పత్తయ్యే కార్లను అమెరికాలో విక్రయించడానికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. 100 శాతబైం దిగుమతి సుంకాలు విధిస్తామని చెప్పారు. పరోక్షంగా బైడెన్ వాహన పరిశ్రమ విధానాలను లక్ష్యంగా చేసుకొని ఈ వ్యాఖ్యలు చేశారు.

ఆయన ఉద్దేశం వేరు: ట్రంప్ బృందం వివరణ

ట్రంప్ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఆయన ఎన్నికల ప్రచార బృందం అధికార ప్రతినిధి కారోలిన్ లీవిట్ వివరణ ఇచ్చారు. బైడెన్ విధానాల వల్ల అమెరికా వాహన పరిశ్రమలో 'ఆర్థిక రక్తపాతం' మొదలవుతుందనే కోణంలోఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు వివరించారు. మరోవైపు ప్రస్తుతం జైల్లో ఉన్న తన మద్దతుదారులకు ట్రంప్ సానుభూతి ప్రకటించారు. గత అధ్యక్ష ఎన్నికల సమయంలో క్యాపిటల్ హిల్‌పై దాడి ఘటనలో అరెస్టయిన వారిని ఆయన 'బందీ'లుగా , దేశ భక్తులు అభివర్ణించారు.

మరోసారి హింసను ప్రోత్సహిస్తున్నారు: బైడెన్ బృందం

ట్రంప్ వ్యాఖ్యలను బైడెన్ ప్రచార బృందం తప్పు పట్టింది. గత ఎన్నికల్లో ఘోర ఓటమి చవి చూసిన ఆయన మరోసారి రాజకీయ హింసకు పాల్పడుతున్నారని ఆరోపించింది. ఆయన ప్రతీకారాన్ని , అతివాదాన్ని ఓటర్లు మరోసారి ఓడిస్తారని వ్యాఖ్యానించింది. అధ్యక్షత్వానికి కావాల్సిన ప్రతినిధులను డెమోక్రాటిక్ పార్టీ తరపున జో బైడెన్, రిపబ్లికన్ పార్టీ నుంచి ట్రంప్ సాధించిన విషయం తెలిసిందే. నవంబర్‌లో జరగబోయే ఎన్నికల్లో వీరు తలపడనున్నారు.

ట్రంప్‌నకు నా మద్దతు లేదు : మైక్ పిన్స్

ట్రంప్ అభ్యర్థిత్వానికి తాను మద్దతు ఇవ్వడం లేదని ఆయన సొంత పార్టీ కీలక నేత మైక్ పెన్స్ తెలిపారు. అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ట్రంప్ అనేక విషయాల్లో పార్టీ విధానాలకు కట్టుబడలేదని. తనకు ట్రంప్ మధ్య చాలా వ్యత్యాసము ఉంది. తాను ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో రాజ్యాంగానికి లోబడే పనిచేశానన్నారు. ఎక్కడా ఒత్తిళ్లకు తలొగ్గి దారి తప్పలేదని, అందుకు తాను గర్విస్తున్నానని చెప్పారు. ట్రంప్ హయాంలో పెన్స్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన విషయం తెలిసిందే. ఈసారి అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీ పడ్డ వారిలో ఆయన కూడా ఉన్నారు. కానీ ప్రైమరీ ఎన్నికలు ప్రారంభం కావడానికి ముందే రేసు నుంచి వైదొలిగారు. గత ఎన్నికల సమయంలో ఫలితాల అనంతరం ట్రంప్ అనుసరించిన వైఖరి, ఆయన మద్దతుదారులు క్యాపిటల్ హిల్‌పై దాడికి దిగడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన విషయం తెలిసిందే.

## శ్రీరాచంద్రుడిగా దర్శనమిచ్చిన నారసింహుడు

యాదగిరిగుట్ట,యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం నారసింహుడు శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని ఆయల మాడవీధుల్లో ఊరేగించారు. సోమవారం రాత్రి స్వామివారికి తిరు కల్యాణ మహోత్సవం నిర్వహించ నున్నారు. కాగా, గుట్టలో భక్తుల రద్దీ సాధారణంగా ఉన్నది. ఉచిత దర్శనానికి గంటా 30 నిమిషాలు, రూ.150 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సుమారు

# పార్టీ ఓడిపోతే వీడిపోవడమేనా?



హైదరాబాద్,తెలంగాణలో కాంగ్రెస్‌కు రాబోయే లోక్‌సభ ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకమైనవి. వ్యక్తిగతంగా కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పెద్ద ఛాలెంజిగా కూడా భావించాలి. కాంగ్రెస్ పార్టీలో ఆయన నిశ్చింతకి, సుస్థిరతకు ఇవి ఎంతో కీలకం. అత్యధిక సీట్లు సాధించి చూయిస్తే ఆయన అధిష్టానం ముందు బలపడటంతో పాటు పార్టీలో సీనియర్ల కినుకును కూడా వదిలించుకోవచ్చు. అన్ని విధాలుగా రూట్ క్లియర్ అయి మిగితా కాలాన్ని సునాయాసంగా దాటవచ్చు. పార్లమెంట్ ఎన్నికలు తమ వంద రోజుల పాలనకు ప్రజలిచ్చే తీర్పు అని కూడా ఆయన చెప్పుకోవడంలో ఎంతో ధీమా కనబడుతోంది. క్షణం వదలకుండా శ్రమించి ఆరు హామీలను జనానికి రుచి చూసి లోక్‌సభ ఓట్లకు పునాది వేసుకున్నారు. ఇంకా అదనపు బలం కావాలి. ప్రత్యర్థులు బలహీనపడాలి. అందుకే తన 100 రోజుల వ్రతం ముగియగానే తమ పార్టీ ద్వారం దగ్గర కొంత కాలంగా పడిగాపులు పడుతున్న భారాస ఎంపీలు, ఎంఎల్ఎలను చేరదీస్తున్నారు.అలా పార్టీ తలుపులు తెరిచి వారికి ఓట్లు పెరిగే దిశగా, గెలుపు గుర్రాల చేర్పులో పడ్డారు. గేట్లు పూర్తిగా తెరిస్తే భారాస ఖాళీ అని కూడా సవాలు విసిరారు. దీని ద్వారా ఆయన కాంటాక్ట్‌లో ఎంత మంది భారాసులు ఉన్నారో అర్థమవుతోంది. భారాసలో ఉన్న 39 లో మిగిలేదెవరో తెలియని పరిస్థితి. 2015లో హైదరాబాద్ జిహెచ్ఎంసి ఎన్నికల్లో భారాస ప్రణాళికనే ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోంది. కార్పొరేషన్ గెలుపు కోసం ఆనాడు కెసిఆర్ నగరంలో గెలిచిన ఇతర పార్టీల ఎంఎల్ఎలను అదిరించి, బెదిరించి ఆనాటి టిఆర్ఎస్‌లో చేర్చుకొని సిటీలో బలం పెంచుకొని బల్దియాను హస్తగతం చేసుకున్నారు. స్థూలంగా అదే సూత్రాన్ని రేవంత్ ఇప్పుడు చేపట్టారు ఆయన అడిగే అవసరం లేకుండానే స్వయంగా భారాస సభ్యులే కాంగ్రెస్‌లోకి రావడానికి ఉవ్విళ్లూరుతున్నారు.ఇక నా రాజకీయం చూయిస్తా అని సవాల్ విసురుతున్న రేవంత్‌ను కలుస్తున్న భారాస నేతల సంఖ్యా రోజురోజుకూ పెరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఇవి తప్పని చర్యలైనా దీర్ఘకాలంలో చిక్కులు కొనితెచ్చుకున్నట్లవుతుంది. నిన్నటి దాక శత్రువుగా చూసిన ప్రత్యర్థి తమ నాయకుడు కావడాన్ని జీర్ణించుకోలేక పార్టీ కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బ తిని కింది స్థాయిలో పార్టీ వేళ్లు బలహీనపడతాయి. ఆ పరిస్థితిని భారాసుంది. పార్టీ ఓటమికి ఇది కూడా ఒక కారణమే. రేపటి సంగతి రేపు చూసుకుందాం అనే ధోరణి ఆరోగ్యకరం కాదు.ఇక అసలు విషయానికొస్తే మన నాయకులు ఎంత నీతివంతులో వాళ్లే స్వయంగా బయట పెట్టుకుంటున్నారు. కెసిఆర్ వెంట ఉంటే లాభమేమి లేదని అటు బిజెపి లేదా ఇటు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఈ రకంగా ఏ పార్టీ అయినా పేక మేడనే అని అర్థమవుతోంది. గెలుపే దాని ఊతకర్ర. అది జారిపోతే కూలిపోవాల్సిందే. గెలుపోటములకు అతీతంగా పార్టీని పట్టుకొని నిలిచే సంప్రదాయం గంగలో కలిసిపోయింది. పారిశ్రామికవేత్తల రాక రాజకీయాల్లో కూడా దీనికి కొంత కారణం అనుకోవచ్చు.రాజకీయాల వల్ల వారికి రెండు రకాలుగా ప్రయోజనమే. కోట్లు ఖర్చు చేసినా రాణి ప్రోటోకాల్ గౌరవం అనుభవించవచ్చు. తమ వ్యాపార పనులు సునాయాసంగా చక్కదిద్దుకోవచ్చు. చట్టాన్ని అతిక్రమించినా అడిగేవాడు ఉండడు. అయితే వీరి డబ్బే వీరికి బలం. ప్రజల పట్ల ఎలాంటి బాధ్యతను తీసుకోరు. పార్టీని వీడడానికి కూడా వెనుకాడరు. ఉన్న పార్టీతో ఎలాంటి భావోద్వేగ అనుబంధం ఉండదు. వీరి చేరిక అన్ని పార్టీలకు ముప్పే. పార్టీని, హోదాని వాడుకోవడమే తప్ప కష్టకాలంలో పార్టీకి అండగా నిలవరు. దీనికి ఉదాహరణగా భారాసను వీడాలనుకుంటే ఎందరో నేతల పేర్లు చెప్పవచ్చు.మరోవైపు భారస పరిస్థితి చూస్తే అయ్యో పాపం అనేలా ఉంది. ఎందుకంటే అందరికో ఆ పార్టీ రాజకీయ ప్రవేశం కల్పించింది. రాజకీయాలకు సంబంధం లేకుండా వ్యాపారాల్లో, విదేశాల్లో ఉన్న తెలంగాణ వారిని పిలిచి పార్లమెంట్‌కు పంపింది. ఇప్పుడు వాళ్లే ముందుగా పార్టీ వీడేందుకు సిద్ధపడుతున్నారు. బిజెపి, కాంగ్రెస్‌లో చేరి మళ్లీ లోక్ సభ సీట్లు సంపాదించుకుంటున్నారు. ఎన్నికల్లో డబ్బే ప్రధానం అయినందున పార్టీల బలం కోసం ఇలాంటి వారిపై పార్టీలు తప్పడం లేదు. అయితే ఓడిన పార్టీ జెండా మోసే ఓపిక, అవసరం వీరికి ఎందుకుంటుంది?

మాజీ మంత్రి మల్లారెడ్డి చట్టసభలో అధ్యక్షా!

అనాలనే కాంక్షను చంద్రబాబు తీర్చినా, కెసిఆర్ ఆయనకు ఎన్నో ఇచ్చారు. ఆర్థికంగా తోడు ఉంటాడనే భావనతో ఆయన పట్ల బారా ఖూన్ మాఫ్ అన్న ధోరణిలో వ్యవహరించారు. ప్రజానేతగా ఎలాంటి యోగ్యతలు లేని ఆయనకు ఎవరికీ ఇవ్వనన్ని అవకాశాలు ఇచ్చారు. అలాంటిది జంప్ జలానిల్లో మల్లారెడ్డి పేరు తొలి వరుసలోనే ఉంది. తిట్ల పురాణానికి సాక్ష్యంగా ఎన్నో వీడియోలు ఉన్నాయి. తమ కాలేజీ బిల్డింగ్ పై పంజా పడగానే మరో దారి లేక పార్టీ వీడను అంటూనే కొడుకుతో సహా బెంగుళూరు వెళ్లి డికె శివకుమార్ ను కలిసిన ఫోటోను లీక్ చేశారు. కెసిఆర్ దేవుడు అని పదే పదే పలికి ఆ దేవుడికే పంగనామాలు పెట్టేందుకు సిద్ధపడుతున్నారు. అదే నోరుతో రేవంత్ సిఎం అవుతారని ముందు చెప్పింది నేనే అనడం మరీ విడ్డూరం. కెనడాలో హోటళ్ల వ్యాపారంలో స్థిరపడ్డ శానంపూడి సాయిదిరెడ్డికి కూడా రాజకీయ భిక్షను భారాసనే పెట్టింది.భారాసను వీడి బిజెపిలో చేరిన మర్నాడే ఆయనకు నల్గొండ లోక్‌సభ సీటు లభించింది. వ్యాపారవేత్త అయిన చేవెళ్ల ఎంపి గడ్డం రంజిత్ రెడ్డి రాజకీయ జీవితం కూడా భారాసతోనే మొదలైంది.ఆయన కూడా పార్టీ వెంట ఉండకుండా ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. ఇలా చాలా అర్థాలు చూయించవచ్చు.తెలంగాణ వచ్చాక రాష్ట్రంలో టిడిపి ఉండే అవకాశం లేదనే భావనతో రాజకీయ వృత్తి జీవులు భారాసలో చేరడానికి ఒక అవకాశం ఉంది. కానీ భారస టికెట్‌పై గెలిచిన ఎంఎల్ఎలు పార్టీని వదిలి కాంగ్రెస్ వైపు వెళ్లడం ఓటర్లను మోసం చేయడమే. నీవు నేర్పిన విద్యనే నీరజాక్షా! అని ఇప్పుడు కెసిఆర్ ను రేవంత్ రెడ్డి నిలదీసే అవకాశం ఉన్నా పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టండి అన్న తన మాటను కూడా రేవంత్ గుర్తు చేసుకోవాలి. మీరు ఒక గుర్తుపై గెలిచారు, నమ్మకంతో ఓటేసిన వారిని అగౌరవపరచకండి అని సలహా ఇచ్చి పంపాలి.

# బీజేపీ ఎంపీ బాండ్ల గేమ్...

న్యూఢిల్లీ,బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ తెలుగు ప్రజలందరికీ సుపరిచితులే. ఆయన 2019లో టీడీపీకి రాజీనామా చేసి కమలదళంలో చేరారు. నిధుల దారి మళ్లింపునకు సంబంధించి అంతకుముందే ఐటీ శాఖ ఆయనపై ఆరోపణలు మోపింది. రమేష్‌తో పాటు మరో ముగ్గురు పార్టీ ఎంపీలు పార్టీని వీడడంతో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైన కొద్ది వారాలకే వీరంతా టీడీపీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు యూరప్ పర్యటనలో ఉన్నప్పుడు ఈ ఫిరాయింపులు జరిగాయి.న్యూఢిల్లీ : ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే మౌలిక సదుపాయాల సంస్థ రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రమేష్ వ్యవస్థాపకులు. ఈ కంపెనీ వ్యవహారాలు, కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్లపై స్వతంత్ర మీడియా సంస్థలు న్యూస్‌లాండ్రీ, స్క్రోల్, ది న్యూస్ మినిట్‌తో పాటు పలువురు స్వతంత్ర పాత్రికేయులు ఓ నివేదికను రూపొందించారు. దాని ప్రకారం గత సంవత్సరం రుత్విక్ ప్రాజెక్ట్స్ ఐదు కోట్ల రూపాయల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. దానికి రెండు వారాల ముందు ఆ కంపెనీకి హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన లెటర్ ఆఫ్ కాంట్రాక్ట్ లభించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ పాలనలో జనవరి 14న ఈ ఎల్ఓసీ వచ్చింది. 2023 మార్చి 23న ప్రభుత్వ రంగంలోని స్వచ్ఛ ఇంధన సంస్థ ఎస్‌వీజేఎన్ లిమిటెడ్ ఇదే ప్రాజెక్టుకు రూ.1,098 కోట్ల కాంట్రాక్ట్ ఒప్పందంపై సంతకాలు చేసింది. మూడు వారాల తర్వాత రిత్విక్ ప్రాజెక్ట్స్ మళ్లీ రూ.40 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసింది.రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మైనింగ్, నీటి పారుదల నుండి హైవేలు, మౌలిక సదుపాయాల వరకూ అనేక రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాశ్మీర్ వలసవాదుల కోసం మినీ టౌన్‌షిప్, పాలేరు ఎర్త్ డ్యామ్ వంటి ప్రాజెక్టులను కూడా ఈ కంపెనీ చేపట్టింది. 2012 నుండి రిత్విక్ వ్యవహారాలతో తనకేమీ సంబంధం లేదని రమేష్ చెబుతున్నారు. అయితే ఆయన సోదరుడు ఇప్పటికీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా, రమేష్ కుమారుడు ఆపరేషన్స్ విభాగానికి అధిపతిగా వ్యవహరిస్తున్నారు.రిత్విక్ ప్రాజెక్ట్స్ కంపెనీ జాడ లేని లావాదేవీల ద్వారా రూ.74 కోట్లు, అనుమానాస్పద బిల్లులతో రూ.25 కోట్లు దారి మళ్లించిందని ఆదాయపన్ను శాఖ 2018లో ఆరోపించింది. ఆ శాఖ అధికారులు హైదరాబాద్, కడపలోని రమేష్ కార్యాలయాల్లో సోదాలు చేశారు. అనేక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. రమేష్ బీజేపీలో చేరడానికి కొద్ది నెలల ముందు ఆ పార్టీ ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు రాజ్యసభ ఎథిక్స్ కమిటీకి ఓ లేఖ రాశారు.

ఆదాయపన్ను అధికారులు చేసిన ఆరోపణలకు సంబంధించి రమేష్‌పై విచారణ జరపాలని కోరారు. అంతేకాదు%శా%రమేష్‌ను 'ఆంధ్ర మాల్యా'గా అభివర్ణించారు.ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వనందుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ 2018లో ఎన్డీఏ నుండి బయటకు వచ్చింది. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఎన్డీఏ ద్వారాలు శాశ్వతంగా మూసేశామని 2019లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అయితే ఈ నెల ప్రారంభంలో చంద్రబాబు ఎన్డీఏ గూటికి చేరిపోయారు. ఏపీ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకే ఎన్డీఏలో చేరామని ఆయన సమర్థించుకున్నారు. కాగా రమేష్ ఇప్పటికీ రాజ్యసభ సభ్యుడుగా కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలం వచ్చే నెలలో ముగుస్తుంది. ఆయనపై ఐటీ శాఖ పెట్టిన కేసు ఇప్పటికీ పెండింగులోనే ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అత్యధిక సంపన్నులైన ఎంపీలలో రమేష్ కూడా ఒకరని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ సంస్థ గత సంవత్సరం ఓ నివేదికలో తెలియజేసింది.అక్రమ మైనింగ్‌కు పాల్పడినందుకు రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు గత సంవత్సరం రెండు కోట్ల రూపాయల జరిమానా విధించారు. వంశధార వాటర్ ప్రాజెక్టులో ఉపయోగించడానికి అని చెప్పి గ్రావెల్, మెటల్‌ను తరలించిన రిత్విక్ కంపెనీ వాటిని ప్రైవేటు వారికి అమ్ముకున్నదని జిల్లా విజిలెన్స్ అధికారి ఒకరు 'ది న్యూ ఇండియా ఎక్స్‌ప్రెస్' పత్రికకు తెలిపారు.

# జగన్‌కు ప్రజలు రెండు బటన్లు నొక్కేనా ?



అమరావతి,తను నొక్కిన విధంగా రెండు బటన్లు నొక్కాలని, ఒకటి అసెంబ్లీ, రెండోది పార్లమెంట్‌కు అంటూ జగన్ చేస్తున్న ప్రకటనతో ప్రజలు ఏ మేరకు స్పందిస్తారన్నది రానున్న ఎన్నికల్లో తేలనుంచి ఇప్పటికే టిడిపి-జనసేన కూటమి దూసుకుపోతున్న తరుణంలో బిజెపి కూడా కూటమిలో చేరడంతో ఎపిలో ఇక పోటీ గట్టిపడింది. ఇది ఓరకంగా అధికార వైకాపాకు పెద్ద సవాల్‌గా మారనుంది. చంద్రబాబు పాలన అంటేనే గ్రాఫిక్స్ మాయాజాలం అని, అమరావతి భ్రమరావతి అంటూ ఇంతకాలం జగన్ ప్రచారం చేశారు. కానీ రాజధాని లేకండా ఐదేళ్ల పాలనతో ప్రజల ఖాతాల్లో నగదు జమ చేస్తూ బటన్ నొక్కుతూ వచ్చారు. రాజధాని అమరావతి నిర్మాణం ఎలా ఉండబోతున్నదో వివరించడానికే అప్పట్లో చంద్రబాబు గ్రాఫిక్స్‌లో చూపించారు. ఒక్క ఛాన్స్ అంటూ వచ్చిన వైసీపీ ప్రచారాన్ని నమ్మిన ప్రజలు జగన్మోహన్ రెడ్డికి అధికారం కట్టబెట్టారు. ఈ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో భవిష్యత్ ప్రణాళికలు అటుంచి, అమరావతి లేకుండా పోయింది. పోలవరం పడకేసింది. పారిశ్రామిక ప్రగతి ఊసే లేకుండా పోయింది. అన్నిరంగాల్లో దోపిడీలో ఎపి వార్తల్లో నిలిచింది. బడుగు బలహీనవర్గాలపై దాడులు జరిగాయి. మర్డర్లు సులువుగా సాగాయి. ఇప్పుడు ఇవన్నీ ప్రజలముందుకు వస్తున్నాయి. టిడిపి కూటమి బలంగా ప్రచారంలో ఇవన్నీ ఎండగడుతోంది. చంద్రబాబు కుప్పంనకు కూడా ఏమీ చేయలేదని, నేను కృష్ణా నీళ్లు తెచ్చానని జగన్ ప్రకటించారు. చంద్రబాబు పాలనలో ఒక్కటంటే ఒక్క పనైనా ఉందా అంటూ నిలదీస్తూ వచ్చారు. ఈ ఐదేళ్లలో జగన్ ఇసుక, లిక్కర్, వ్యాపారాలతో దోచుకుందని ఆరోపణలు ఉన్నాయి. జగన్‌ను ఫేక్ ముఖ్యమంత్రి అని, జగన్ పాలనను ఫేక్ పాలన అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. సంక్షేమ పథకాల అమలులో లంచాలకు తావు లేకుండా చేశామని జగన్ చెప్పుకుంటున్నారు. సంక్షేమ పథకాలను పైసా లంచం లేకుండా అందిస్తున్నామని ఆయన ప్రచారం చేస్తున్నారు. గెలవలేకనే చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని విమర్శలు చేస్తూ వచ్చారు. అయితే ఎన్నికల్లో ఇవన్నీ మామూలు. ప్రజలు పొత్తులను తప్పుపట్టరు. ఇకపోతే పోటీకి సరైన అభ్యర్థులు లేక.. ప్రకటించిన అభ్యర్థులను కూడా మార్చివేస్తున్న జగన్ సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ఉలిక్కిపడే సర్వే వచ్చింది. ఏపీ ఓటర్ల నాడికి అద్దం పట్టేలా 'పయనీర్ పోల్ స్టాటజీస్ ప్రైవేటు లిమిటెడ్' లేటెస్ట్ సర్వేను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా టీడీపీ-జనసేన కూటమి 104 స్థానాల్లో విజయకేతనం ఎగురవేస్తుందని సర్వే అంచనా వేసింది. అధికార వైఎస్సార్‌సీపీ కేవలం 49 సీట్లకే పరిమితం కానుందని తేల్చింది. 22 నియోజకవర్గాల్లో నువ్వా-నేనా అన్నట్టుగా గట్టి పోటీ ఉంటుందని విశ్లేషించింది. ఇక ఎంపీ స్థానాల విషయానికి వస్తే టీడీపీ-జనసేన కూటమి 18 స్థానాలను కైవసం చేసుకుంటుందని సర్వే లెక్కగట్టింది. వైసీపీకి 7 స్థానాలు వస్తాయని పేర్కొంది. టీడీపీ- జనసేన కూటమికి ఓటింగ్ షేర్ భారీగా పెరగడం ఖాయమని 'పయనీర్ పోల్ సర్వే పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో సర్వే చేపట్టామని, వేలాదిమంది అభిప్రాయాలను సేకరించినట్టు వెల్లడించింది. మొత్తంగా ఇప్పుడు గట్టి పోటేనే ఎదుర్కోబోతున్నారు. బిజెపి కూడా టిడిపి కూటమిలో చేరడంతో జగన్ ముప్పేటా విమర్శలు ఎదుర్కోక తప్పదు.

# గేట్లు తెరిచిన కాంగ్రెస్ ..కెసిఆర్ చూపిన బాటలో పయనం



హైదరాబాద్,కాంగ్రెస్ గేట్లు తెరిచింది. పార్లమెంట్ ఎన్నికల ముందు వ్యూహాత్మకంగా పార్టీలోకి చేరికలు మొదలయ్యాయి. దానం నాగేందర్, రంజిత్ రెడ్డిలు తొలి అడుగు వేశారు. ఇప్పటికే పసునూరి దయాకర్, కోరేరు కోనప్ప కూడా చేరారు. ప్రధానంగా ఎంపి ఎన్నికల్లో విజయం లక్ష్యంగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించారు. కెసిఆర్ చూపిన తోవలేనే నడుస్తున్నారు. గతంలో అంటే 2014లో టిఆర్ఎస్‌కు 63 మంది ఎమ్మెల్యేలే ఉండేవారు. దీంతో ప్రభుత్వ సుస్థిరత కోసం తెలుగుదేశం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కెసిఆర్ టీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. రాజకీయ పునరేకీకరణ అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ బలం కూడా 64 కావడం విశేషం. ఈ కారణంగా నాడు కేసీఆర్ చూపిన బాటలో ఇప్పుడు తాము కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటే తప్పేమిటి అని కాంగ్రెస్ ముఖ్యులు ప్రశ్నిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం జంట నగరాలు, రంగారెడ్డి జిల్లాల నుంచి గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో అత్యధికులు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లోకి వెళ్లారు. చేరికలకు తలుపులు తెరిస్తే గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా మిగలకపోవచ్చునని అంటున్నారు. ప్రస్తుతానికి ఇద్దరు మినహా మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరడానికి సుముఖత వ్యక్తంచేస్తున్నారు. తమాషా ఏమిటంటే, గ్రేటర్‌లో గెలిచిన శాసనసభ్యులు అందరూ గతంలో తెలుగుదేశం, కాంగ్రెస్ తరఫున గెలిచి బీఆర్ఎస్‌లో చేరినవారే. తాజా సమాచారం ప్రకారం పదిహేను మందికి పైగా ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌తో పాటు, రంగారెడ్డిలో బిఆర్ఎస అత్యధికంగా సీట్లు గెల్చుకోవడంతో ఆ పార్టీ 39 స్థానాల్లో గెలుపొందింది. మేం గేట్లు తెరిస్తే బిఆర్ఎస్‌లో ఆ ముగ్గురే మిగులుతారని సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. అంటే ఆ ముగ్గురు తప్ప అందరినీ చేర్చుకునే కార్యక్రమం మొదలయ్యిందా అన్నది చూడాలి. లోక్‌సభ ఎన్నికలలోపే ఈ చేరికలు జరిగిపోతే భారత రాష్ట్ర సమితికి కోలుకోలేని దెబ్బ తగలడం ఖాయంగా ఉంది. ఫిరాయింపులకు గతంలో తెర లేపింది కేసీఆరే కనుక ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అదే పనిచేసినా వారిని ప్రశ్నించే నైతికత వారికి లేదు. ఈ పరిస్థితిని అనుకూలంగా మలచుకోవడానికి కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. 2014లో అత్తెసరు మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చినందున ఫిరాయింపులను ప్రోత్సహించినా కేసీఆర్‌ను ప్రజలు సమర్థించారు. 2018లో 88 స్థానాలను గెలుచుకున్నప్పటికీ ఫిరాయింపులను ప్రోత్సహించడాన్ని ప్రజలు ఆక్షేపించారు. ఈ నేపథ్యంలో పార్టీలో చేరడానికి ముందుకొచ్చే శాసనసభ్యులకు తలుపులు తెరవాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి వచ్చింది. ఇప్పుడు తాము ఆ పనిచేయకపోతే ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భారతీయ జనతా పార్టీలో చేరిపోతారని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. దీంతో చేరికలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం పది స్థానాలను గెలవడం కాంగ్రెస్ ముందున్న ప్రధాన లక్ష్యంగా ఉంది. ఇన్ని సీట్లు గెలిస్తే తప్ప కాంగ్రెస్ పదిలంగా ఉండదు. ఇందుకోసం రేవంత్ రెడ్డి వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నారు. అందుకే పార్లమెంట్ ఎన్నికలు తమ వందరోజుల పాలనకు రెఫరెండంగా ప్రకటించారు. గెలిచినా, గెలవకపోయినా తనదే బాధ్యతని అన్నారు. ఇక భారతీయ జనతా పార్టీ విషయానికి వస్తే, ఆ పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను మాత్రమే గెలుచుకున్నప్పటికీ ప్రస్తుతం మంచి ఊపు మీదే ఉంది. దక్షిణ తెలంగాణలో పార్టీ బలహీనంగా ఉన్న విషయాన్ని గమనించిన కమలనాథులు ఆ దిశగా దృష్టి సారించారు. ప్రజల్లో పట్టున్న నాయకులను గుర్తించి ఎంపీ అభ్యర్థులుగా బరిలో దించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఖమ్మం నుంచి జలగం వెంకట్రావ్, మహబూబాబాద్ నుంచి సీతారాం నాయక్‌ను పార్టీలో చేర్చుకున్నారు. గత ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు అంతకంటే ఎక్కువ సీట్లు గెలుచుకోవడం కోసం పావులు కదుపుతోంది. ఐదు, అంతకు మించి సీట్లు గెలుచుకోగలిగితే రాష్ట్రంలో బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరిస్తుంది. ఈ క్రమంలో బిఆర్ఎస్‌ను బలహీన పరిచే కార్యక్రమంలో వారు కూడా అడుగులు వేస్తున్నారు. కవిత అరెస్ట్‌తో కెసిఆర్, ఆయన కుటుంబం ఆ వైపు దృష్టి సారించింది. ఇప్పుడు పార్టీలో ఏం జరుగుతున్నా పెద్దగా ప్రయత్నాలు చేయడం లేదు. ప్రధాని మోదీ ఇప్పటికే తెలంగాణలో రెండు రోజులు ప్రచారం చేశారు. తెలంగాణలో బలపడితే ఆ తర్వాత ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించవచ్చునన్నది కమలనాథుల వ్యూహంగా ఉంది. తెలంగాణలో దూకుడు ప్రదర్శిస్తే మెజారిటీ సీట్లు గెలుచుకోవచ్చునని బిజెపి నేతలు లెక్కలు వేసుకుంటున్నారు.ప్రధాని మోదీ గ్లామర్ అదనపు బలం కనుక లక్ష్య సాధన అసాధ్యం కాదని బీజేపీ నాయకులు నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థతకు గీటురాయి కానుంది. ఇందులో అసలు సిసలు విషమ పరీక్షను కేసీఆర్ ఎదుర్కోబోతున్నారు.

# వైఎస్ కుటుంబంలో మళ్లీ పోటీ



కడప,ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికలు తారాస్థాయిలో జరగబోతున్నాయి. గతంలో ఎప్పుడూ చూడని విధంగా ఇప్పుడు ప్రతిష్టాత్మకంగా కనిపిస్తున్నాయి. ఏకంగా అన్నపై ఇన్ని రోజులు విమర్శలు చేస్తూ వచ్చిన షర్మిల ఆయన్నే ఢీ కొట్టేందుకు సిద్ధమయ్యారు. కడప ఎంపీగా పోటీ చేస్తున్నారు. ఇది నేరుగా అన్న జగన్‌పై పోటీ కాకపోయినా ఆయన నమ్మిన బంటుగా ఉన్న అవినాష్‌ను ఢీ కొడుతున్నారు. వైఎస్ ఫ్యామిలీ్ ÷ట్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగా మారింది. వైఎస్ వివేక హత్య కేంద్రంగా వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. ఈ కేసులో అవినాష్ పాత్ర ఉందని వైఎస్ వివేక కుమార్తె సునీతతోపాటు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపిస్తూ వస్తున్నారు. సొంత బాబాయ్‌ను హత్య చేసిన అవినాష్‌కు జగన్ సహాయం చేస్తున్నారని ఆయన్ని కాపాడుతున్నారని మండిపడుతు న్నారు. వైఎస్ వివేక హత్య కేసులో అవినాష్ ప్రధాన ముద్దాయి అంటూ షర్మిల, సునీతతోపాటు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అలాంటి విమర్శలు పట్టించుకోని జగన్... అవినాష్‌కు కడప ఎంపీ టికెట్ మరోసారి ఇచ్చారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తన సపోర్ట్ పూర్తిగా అవినాష్‌కే ఉంటుందని చెప్పకనే చెప్పేశారు. వారి విమర్శలకు ఇలా సమాధానం చెప్పారు. అవినాష్ కడప ఎంపీగా వైసీపీ తరఫున పోటీ చేస్తుండటంతో అక్కడ ఆయనకు పోటీగా సునీత కానీ ఆమె తల్లి సౌభాగ్యమ్మ కానీ పోటీ చేస్తారని అంతా భావించారు. కానీ ఇప్పుడు అనూహ్యంగా షర్మిలయే అక్కడ పోటీకి దిగబోతున్నారు. నేరుగా అవినాష్‌తో ఢీ కొట్టేందుకు సిద్ధమయ్యారు. అధికారికంగా దీనిపై ఇంత వరకు సమాచారం లేకపోయినా కాంగ్రెస్ పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం కడప ఎంపీ స్థానానికి షర్మిల పేరు ఖరారు అయినట్టు తెలుస్తోంది. వైసీపీ పునాదులు రక్తం తడిసి ఉన్నాయని ఆరోపిస్తున్న సునీత, షర్మిల ఇప్పుడు వారిపైనే పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. ఇలా వైఎస్ ఫ్యామిలీ పోటీ కొత్తకాదు. గతంలో వైఎస్ వివేకానంద కూడా వైఎస్ విజయపై పోటీ చేసి ఓడిపోయారు. అప్పట్లో కాంగ్రెస్‌ను విభేదించి పార్టీ పెట్టుకున్న జగన్, విజయమ్మ తమ పదవులకు రాజీనామా చేశారు. అప్పట్లో విజయమ్మ రాజీనామాతో పులివెందులకు, జగన్ రాజీనామాతో కడప ఎంపీ స్థానానికి ఉప ఎన్నికలు వచ్చాయి. ఈ బై ఎలక్షన్‌లలో పులివెందుల నుంచి విజయమ్మకు పోటీగా వివేకానంద పోటీ చేశారు. ఆయనకు డిపాజిట్లు కూడా రాలేదు. అలాంటి పోటీ ఇప్పుడు మళ్లీ వైఎస్ ఫ్యామిలీలో కనిపిస్తోంది. వివేక హత్య కేసులో ప్రధాన నిందితుడు అవినాష్ అని ఆయన్ని జగన్ ఎందుకు కాపాడుతున్నారో అర్థం కావడంలేదని షర్మిల ఆరోపిస్తున్నారు. తండ్రిలేని సునీతకు తాను అండగా ఉంటానని... దోషులకు శిక్ష పడే వరకు విశ్రమించబోనని మొన్ననే ప్రకటించారు. అయితే షర్మిల ఎక్కడైనా అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తారని...సునీతను లేదా సౌభాగ్యమన్ను కడప పార్లమెంట్ స్థానంలో నిలబెడతారని అనుకున్నారంతా. దీనిపై వారిద్దరిని చాలా సార్లు ప్రశ్నిస్తే సమయం వచ్చినప్పుడు అన్నీ చెబుతామంటూ దాటవేశారే తప్ప సమాధానం చెప్పలేదు. ఇప్పుడు ఆ ప్రశ్నలకు సమాధానం దొరికినట్టు అయింది. పోటీలో షర్మిలయే నిలబడుతున్నట్టు ఖరారు అయింది. ప్రజలు ఎవరికి పట్టం కడతారో చూడాలి. ఓవైపు సంక్షేమ అజెండాతో వెళ్తున్న వైసీపీ అభ్యర్థి అవినాష్‌కు జనం ఓటేస్తారా? లేకుంటే వివేక హత్య కేసు నిందితుడు అవినాష్‌ను ఆయనకు సహకరిస్తున్న జగన్‌ను ఓడించాలన్న షర్మిల నినాదానికి మద్దతు ఇస్తారో జూన్ నాలుగున తేలిపోనుంది. వీళ్ల ఆరోపణలు మాత్రమే కాదు. సీబీఐ కూడా అవినాష్ పాత్రను అనుమానిస్తోంది. ఆయన్ని చాలా సార్లు విచారించింది. అరెస్టు కూడా చేసినట్టు పేర్కొంది. అరెస్టు అయిన కొన్ని గంటల్లోనే బెయిల్ కూడా వచ్చిందని వివరించింది. మొత్తానికి వివేక హత్య జరిగి ఐదేళ్లు అవుతున్నా కాక మాత్రం తగ్గలేదు. అప్పట్లో దీన్నే ప్రధాన అస్త్రంగా వాడుకొని జగన్ ప్రచారం చేశారు. ఈ కేసులో చంద్రబాబు హస్తం ఉందని జనంలోకి తీసుకెళ్లారు. కానీ ఐదేళ్లు తిరిగే సరికి సీన్ రివర్స్ అయింది. ఇప్పుడు జగన్ హస్తం ఉందంటూ సొంత ఇంటి సభ్యులే ఆరోపిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. ప్రజల తీర్పు ఎలా ఉంటుందో వేచి చూడక తప్పదు.

# 9 మందితో మరో జాబితా...



హైదరాబాద్ : నేడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ), కాంగ్రెస్ ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశం. ఈ సమావేశానికి తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఆదివారం రాహుల్ న్యాయ యాత్ర ముగింపు సభలో పాల్గొనేందుకు వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు అటు నుంచి నేరుగా ఢిల్లీకి వెళ్లారు. ఈ కోరనే సిఎం రేవంత్ రెడ్డి సీడబ్ల్యూసీ, సీఈసీ మీటింగ్‌లో పాల్గొననున్నారు. కాగా, నేడు జరిగే లోక్ సభ అభ్యర్థుల ఎంపిక గురించి చర్చిస్తున్నా రు. ఇప్పటికే తెలంగాణ నుంచి తొలి జాబితాలో కాంగ్రెస్ నలుగురు అభ్యర్థులను ప్రకటించగా మిగిలిన 13 మంది అభ్యర్థుల ఎంపికపై చర్చించనున్నారు. అయితే నేటి సీఈసీ అభ్యర్థులను ఫైనల్ చేయనున్నారు. అయితే అందులో 9 మందితో కూడిన జాబితాను (రాత్రిలోగా ఏఐసిసి ప్రకటించే అవకాశం ఉన్నట్టుగా కాంగ్రెస్ ఉన్నట్లు ఉంది. మిగిలిన నాలుగు స్థానాలు (ఖమ్మం, నాగర్ కర్నూల్, మల్కాజ్ గిరి, భువనగిరి స్థానాలను పెండింగ్‌లో పెట్టి) నాలుగైదు రోజుల్లో ఆ స్థానాల అభ్యర్థులను వెల్లడించే అవకా శం ఉన్నట్లు తెలిసింది. ఈ నాలుగు స్థానాలను చివరి వరకు లాగి ఫ్లాష్ సర్వే, అప్పటి పరిస్థితులను బేరీజు వేసుకున్న తరువాత ఫైనల్ చేస్తారన్న చర్చ సాగుతోంది. మరోవైపు సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ మేనిఫెస్టోను ఆమోదించడంతో పాటు ఎన్నికల ప్రచారం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్ హైకమాండ్ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

కొత్తగా చేరిన వారి బలబల చర్చ..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల తర్వాత అధిష్టానం నుంచి సీఎం రేవంత్‌పై సమావేశమయ్యారు. ఈ భేటీలో భాగంగా రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు, మిగిలిన లోక్‌సభ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి అధిష్ఠానంతో సిఎం రేవంత్‌పై చర్చించినట్లు తెలిసింది. దీంతోపాటు కొత్తగా పార్టీలో చేరిన వారికి ఎంపీ టికెట్లు ఇచ్చే విషయమై కూడా ఆయన అగ్రనేతలకు వివరించినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రకటించని 13 నియోజకవర్గాల్లో వారం క్రితం సునీల్ కనుగోలు చేపట్టిన ఫ్లాష్ సర్వే ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయాలని నిర్ణయించిన సిఎం రేవంత్ ఆయన కొత్తగా పార్టీలో చేరిన నాయకుల బలాల గురించి కాంగ్రెస్ అగ్రనాయకులకు తెలియచెప్పినట్లుగా తెలిసింది. చేవెళ్ల నుంచి సునీతా మహేందర్ రెడ్డిని బరిలోకి దింపాలని కాంగ్రెస్ భావించింది. బిఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో సీన్ మారిపోయింది. ఫ్లాష్ సర్వేలో ఎంపీ రంజిత్‌రెడ్డికి అనుకూలంగా రావడంతో సునీతా మహేందర్ రెడ్డి చేవెళ్ల నుంచి పక్కన పెట్టింది. దీంతో సునీతా మహేందర్ రెడ్డిని ఎక్కడి నుంచి పోటీలోకి దింపుతుందని నేడే తేలే అవకాశం ఉందని పార్టీలు ఉన్నాయి. సికింద్రాబాద్ టికెట్ ను బొంతు రామ్మోహన్‌కు, మల్కాజ్ గిరి సీటును చంద్రశేఖ్ రెడ్డికి ఇస్తారని ప్రచారం జరిగిన ఫ్లాష్ సర్వేతో పునరాలోచనలో పడ్డట్లు సమాచారం. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్ ను సికింద్రాబాద్ నుంచి బరిలోకి దించాలని నిర్ణయించినట్లు తెలిసింది. మరోవైపు పొత్తులో భాగంగా మీకు ఒక్క సీటైనా అందుబాటులో సిపిఐ అడుగుతోంది. ఏఐసిసి ఎలాంటి నిర్ణయం తీసుకోవడం చాలా ఆసక్తికరంగా మారింది. పూర్తి స్థాయిలో క్లారిటీ కోసం ఆశావహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అయితే పార్టీలో చేరిన కొత్తవారికి టికెట్లు ఇవ్వొద్దని పార్టీ కేడర్ అధినాయకత్వానికి సూచించే విధంగా వారి సూచనలను ఎంతవరకు పరిగణలోకి తీసుకున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

# బడుగుల అండను కోల్పోతున్న బిఎస్పీ




హైదరాబాద్, ఒకప్పుడు యూపీ రాజకీయాలను శాసించిన బీఎస్పీ నామావశిష్టంగా మారిపోవడం విషాదం. బడుగు వర్గాలకు అండగా నిలిచిన పార్టీ మట్టి కరచి పోవడం దేశంలో బడుగులకు గొడుగు లేకుండా పోయింది. దీనికితోడు మాయావతి నాయకత్వం కూడా ప్రభావవంతంగా లేదు. ఇలాంటి సందర్భంలో తెలంగాణలో ఐపిఎస్ పదవికి రాజీనామా చేసి బిఎస్పీలో చేరిన ప్రవీణ్ కుమార్ లాంటి వారికి ఈ ఫలితాలు నిస్తేజం కలిగించేవే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బిఎస్పీ తెలంగాణలో ఎక్కడా ప్రభావం చూపలేదు. అలాగే బిఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ కూడా ఓటమి చెందారు. ఈ క్రమంలో అనూహ్యంగా యాన రాజీనామా చేయడం, బిఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించడంతో పరువు పోగొట్టుకున్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని వమిర్శించి ఇప్పుడు అదే పార్టీలో చేరడం ద్వారా విలువలను తుంగలో తొక్కారు. తానే నామమాత్రపు రాజకీయనేతనని చాటుకున్నారు. దీంతో తెలంగాణలో ఇక బిఎస్పి ప్రస్థానం ముగిసినట్లుగనే భావించాలి. ఒకప్పుడు యూపిని ఏలడంతో పాటు, బడుగులకు ఆశాజ్యోతిగా ఉన్న బిఎస్పీ ఇప్పుడు ఉనికి కోల్పోవడం చూస్తుంటే..బడుగులకు కూడా ఆశలు సన్నగిల్లాయా అన్న అనుమానాలు వస్తున్నారు. అంతేగాకుండా యూపిలో అధికార పీఠానికి దూరంగానే మిగిలిపోయింది. సంక్లిష్ట కుల, ప్రాంత సమీకరణలతో బహుముఖ పోటీ ఉండే యూపీ లాంటి రాష్ట్రం కేవలం బీజేపీ, ఎస్పీల ద్విముఖ పోరుగా మారిపోవడం గమనించాలి. ఈ పోరుతో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)తో పాటు కాంగ్రెస్ కూడా నలిగిపోయింది. ప్రియాంక పగ్గాలు తీసుకొని ప్రచారం చేసినా, యూపీలో 3 శాతం కన్నా తక్కువ ఓట్లకే కాంగ్రెస్ పరిమితమైతే, బిఎస్పీ అంతకన్నా దారుణ పరాభవాన్ని మూటకట్టుకుంది. దశాబ్దాలుగా లేని విధంగా యూపీలో అధికార పక్షాన్నే రెండోసారి పీఠమెక్కించాయి. గతంలో బిజెపి మద్దతుతో లేదా ఎస్పీ మద్దతుతో అధికారం నడిపిన మాయావతి ఎందుకనో నిస్తేజంగగా మారారు. తాజా రాజకీయాల్లో నామమాత్ర పాత్రకే పరిమితం అయ్యారు. బిఎస్పీ తన పూర్వ ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోయింది. గూండాగిరికి దూరంగా శాంతిభద్రతల పాలనపై ప్రచారం యూపీలో బీజేపీకి కలిసొచ్చాయి. ఇంటింటా ఎన్నికలలో గెలుపోటములు ఎక్కువగా సెంటిమెంట్ అంశాల మీదే తప్ప, అసలు వాస్తవాల మీద ఆధారపడి ఉండవు. అయితే ఓటు బ్యాంకును కూడా కోల్పోవడం మాయావతి నాయకత్వ వైఫల్యం తప్ప మరోటి కాదు. కాన్షీరామ్ లాంటి బలమైన నేత ఇప్పుడు బిఎస్పీకి రావాలి. బడుగు బలహీనవర్గాలకు అండగా ఉన్నారన్న ప్రభావం చూపాలి. ధరల పెరుగుదల, ఉపాధి లేమి, రైతు ఉద్యమాలు, మధ్యతరగతి కష్టాలు, అధికారపక్షానికి సాధారణంగా ఎదురయ్యే వ్యతిరేకత లాంటివేవీ బీజేపీ గెలుపును ఆపలేక పోయాయి. భావోద్వేగాలను ప్రేరేపించే ఈ ప్రయత్నం తాజా ఎన్నికల్లోనూ ఫలించింది. పార్టీ అధికారంలో ఉన్న యూపీలో లఖీమ్‌పూర్ ఖేరీ, హాథ్రస్ లాంటి ఘటనలు, ఉత్తరాఖండ్‌లో సీఎంల మార్పులు, గోవాలో అంతర్గత బలహీనతల లాంటి ప్రతికూలతలున్నా ఓటర్ల తీర్పు మాత్రం బీజేపీకే అనుకూలించింది. పోటాపోటీ ఉంటుందన్న ఉత్తరాఖండ్‌లో తుది తీర్పు కాంగ్రెస్‌కు షాక్ కలిగించింది. నిజానికి బిఎస్పీ, కాంగ్రెస్ పార్టీల్లోనే బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట దక్కుతుంది. అలాంటిది ఈ రెండు పార్టీలు ఈ ఎన్నికలతో తమ మూలాలను కోల్పోయాయి. బీజేపీ, మోదీ ప్రభంజనాలకు ఇప్పటికైతే తిరుగులేదనే భావనను ఈ ఎన్నికలు కలిగించాయి. విభిన్న సమీకరణాల ఎన్నికల రాజకీయాల నిర్వహణలో ప్రస్తుతం దేశంలో మరే పార్టీ దానికి పోటీలో లేవని నిరూపితం అయ్యింది. కులాల గురించి పోరాడుతున్న వారు సైతం బిజెపి గొడుగుకిందకు చేరుతున్నారు. ఈ ఫలితాలతో బిఎస్పీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. నిజానికి బిఎస్పీలో కూడా మాయావతి తిరుగేలని నియంతలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ రకంగా చెప్పాలంటే బిఎస్పీ, కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ఆప్, బిజెపిలకు మళ్లుతోందని గుర్తించాలి. అదే సందర్భంలో పర్మినెంట్ ఓటు బ్యాంక్ కూడా ఇక ఉండబోదన్న సంకేతాలను గుర్తించాలి. కొత్త ఓటర్ల రాక,యువత ఆలోచనలు మారడం లాంటివి కూడా సంప్రదాయ ఓటుబ్యాంక్‌ను దెబ్బతీస్తున్నాయి. మోదీ పాపులారిటీకి యువత ఆకర్శితులు అవుతున్నారు. ఇప్పటికైనా నాయకత్వ లోపాలను సరిదిద్దుకోకపోతే బిఎస్పీకి భవిష్యత్తు కష్టమే.

# జయప్రద జైలు శిక్షను రద్దు చేసిన సుప్రీంకోర్టు

జయప్రదకు పడిన ఆరునెలల జైలు శిక్షను సుప్రీంకోర్టు రద్దు చేసింది. తన సినిమా థియేటర్‌లో పనిచేసిన ఉద్యోగులకు ఈఎస్ఐ కంట్రిబ్యూషన్ చెల్లించని కేసులో జస్టిస్ అభయ్ ఓకా, ఉజ్జల్ భూయాన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. థియేటర్ యాజమాన్యం రూ. 9లక్షల80వేలను ఈఎస్ఐ కంట్రిబ్యూషన్ కింద జమ చేసినందున కోర్టు శిక్షను రద్దు చేసింది. చెన్నైలోని జయప్రదకు చెందిన సినీ థియేటర్‌లో జయప్రద, ఆమె ఇద్దరు సోదరులు వాటాదారులుగా ఉన్నారు. ఈ థియేటర్ 10 ఏళ్ల క్రితమే మూతపడింది. అయితే ఈ థియేటర్‌లో పనిచేసిన ఉద్యోగుల జీతాల నుంచి ఈఎస్ఐ పేరుతో కోతలు విధించి తమ వద్ద జమ చేయలేదని ఈఎస్ఐకార్పొరేషన్(ఈఎస్ఐసీ) కేసు పెట్టింది. ఈ కేసును విచారించిన చెన్నైలోని మెట్రోపాలిటన్ కోర్టు గత ఏడాది ఆగస్టులో జయప్రదకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. అనంతరం ఈ కేసులో ఆమె అప్పీల్‌కు వెళ్లగా సుప్రీంకోర్టులో ఊరట లభించింది.



Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com